www.mahinewsindia.com

# మహి న్యూస్

MAHI NEWS

Epaper: https://epaper.mahinewsindia.com

తెలుగు దినపత్రిక

ఆంధ్రప్రదేశ్,తెలంగాణ. సంపుటి : 02 సంచిక : 208 ఎడిటర్ : నీలి రామసుబ్బయ్య. పేజీలు : 8 వెల రూ. 2 బుధవారం -28 - అక్టోబర్ - 2026

Published From :YSR Kadapa circulated by Kurnool I Anatapuram I Chittoor I East & West Godavari I Guntur I Krishna I Nellore I Srikakulam I Visakhapatnam I Vijayanagaram I Prakasham & Hyderabad & Telangana







## అర్ణబ్ ఎఫెక్ట్.. ఉత్తరాంధ్రలో పూర్తిగా మారిన వాతావరణం

- పశ్చిమమధ్య బంగాళాఖాతంలో బలపడిన 'అర్ణబ్' తుపాను
- గంటకు 20 కి.మీ వేగంతో ఏపీ తీరం వైపు వేగంగా కదులుతున్న అతి తీవ్ర తుపాను
- నేడు ఉదయం బాపట్ల-విశాఖ మధ్య తీరం దాటే అవకాశం
- తీరం దాటే సమయంలో గంటకు 125-135 కి.మీ. వేగంతో గాలులు
- కోస్తాంధ్ర జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాల హెచ్చరిక

### కాకినాడకు 167 కి.మీ.

# దూరంలో 'అర్ణబ్..

### అధికారులకు చంద్రబాబు దిశానిర్దేశం

- ★ అర్ణబ్ తుపాను ముప్పుపై సీఎం చంద్రబాబు ఉన్నతస్థాయి సమీక్ష
- ★ కాకినాడ సమీపంలో కేంద్రీకృతమైన తుపాను
- ★ లోతట్టు ప్రాంతాల ప్రజలను తరలించాలని కలెక్టర్లకు ఆదేశం
- ★ సహాయక చర్యల కోసం ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బలగాల వినియోగం
- ★ విద్యుత్, రవాణా పునరుద్ధరణకు తక్షణ చర్యలు చేపట్టాలని సూచన



అమరావతి: బంగాళాఖాతంలో ఏర్పడిన 'అర్ణబ్' తుపాను ఆంధ్రప్రదేశ్ తీరం వైపు వేగంగా కదులుతున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో అప్రమత్తమైంది. ముఖ్యమంత్రి చంద్రబాబు మంగళవారం అమరావతిలోని తన క్యాంపు కార్యాలయంలో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. తుఫాను ప్రస్తుత పరిస్థితి, మిగతా 2 లో

## స్థానిక ఎన్నికల సీట్లపై సార్వత్రిక ఎన్నికల కన్నా ఎక్కువ కసరత్తు చేశాం




- ఇక ట్రిపుల్ ఇంజన్ సర్కార్.. స్థానిక ఎన్నికలపై చాలా కసరత్తు చేశాం
- స్థానికాల్లోనూ గెలిచి ట్రిపుల్ ఇంజన్ వేగంతో అభివృద్ధి చేస్తామని వెల్లడి
- గొడ్డలి పార్టీ తమ సహనాన్ని పరీక్షిస్తోందన్న చంద్రబాబు
- కూటమి అభ్యర్థుల గెలుపు కోసం మూడు పార్టీల కార్యకర్తలు కలిసి పనిచేయాలని పిలుపు

## 15 ఏళ్లలో 38 మందిని చంపి తిన్న నరహంతకుడు..




### ఉగాండాలో సీరియల్ కిల్లర్ అరెస్ట్!

నిందితుడిని ముజురిజి మోసెస్‌గా గుర్తించిన భద్రతా దళాలు

మసాకా, ఇబందా, కాజో జిల్లాల్లో ఘాతుకాలకు పాల్పడినట్లు ఆరోపణలు

బహిరంగంగా విచారించి ఉరి తీస్తామని ప్రకటించిన ఆర్మీ చీఫ్

నిందితుడిని గతంలోనూ పట్టుకున్నా తప్పించుకున్నట్లు వెల్లడి




## చెంబరంబాక్కం రిజర్వాయర్‌ను తనిఖీ చేసిన సీఎం విజయ్

చెంబరంబాక్కం రిజర్వాయర్‌కు సీఎం విజయ్..

2015 పునరావృతం కాకూడదని హెచ్చరిక!

రిజర్వాయర్‌ను 24/7 పర్యవేక్షించాలని సూచన

తుపాను ముప్పు నేపథ్యంలో అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశం




## 'బ్రేకింగ్ బ్యాడ్' తర్వాత ఇప్పుడు 'ప్రిజన్ బ్రేక్': విజయ్ ప్రభుత్వంపై స్టాలిన్ విమర్శలు

తేని జైలు నుంచి 17 మంది విచారణ ఖైదీలు పరారీ కావడంతో దుమారం

సీఎం విజయ్ నేతృత్వంలోని ప్రభుత్వం చేతకానిదని స్టాలిన్ ఆరోపణ

# కూటమి స్ఫూర్తితో అధికారిక అభ్యర్థుల గెలుపుకు పనిచేయాలి

- స్థానిక ఎన్నికలపై పవన్ కీలక వ్యాఖ్యలు.. రెబల్స్‌కు స్పష్టమైన హెచ్చరిక జారీ
- పార్టీ బీఫామ్ ఇచ్చినవారే అధికారిక అభ్యర్థులన్న పవన్ కళ్యాణ్
- మిగిలిన వారు నామినేషన్లు ఉపసంహరించుకోవాలని సూచన



అమరావతి: స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్ కీలక వ్యాఖ్యలు చేశారు. పొత్తులో భాగంగా పార్టీ అధికారికంగా బీఫామ్ జారీ చేసినవారే కూటమి అభ్యర్థులని, నామినేషన్లు వేసిన మిగతా 2 లో

# రాష్ట్రం పిచ్చోడి చేతిలో రాయిలా మారింది

### ప్రభుత్వమే కృత్రిమ కరవు సృష్టిస్తోందని కేటీఆర్ ఆరోపణ

- గోదావరిలో నీళ్లున్నా ఎత్తిపోయడం లేదని విమర్శ
- మరో ఏడాదిన్నరలో కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి అవుతారని వ్యాఖ్య



హైదరాబాద్: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. గోదావరిలో నీళ్ల మిగతా 2 లో




## ఈటల రాజేందర్ పాదయాత్రకు బ్రేక్.. అనుమతి నిరాకరించిన పోలీసులు

- జవహర్‌నగర్ డంపింగ్ యార్డ్ తరలింపు డిమాండ్‌తో యాత్రకు పిలుపు
- ఘట్‌కేసర్ మండలం ఏదులాబాద్‌లో ప్రారంభానికి ముందే ఉద్రిక్తత
- ఎంపీగా తన నియోజకవర్గంలో పర్యటించే హక్కు ఉందన్న ఈటల
- గతంలో ఇదే అంశాన్ని సీఎం రేవంత్ ప్రస్తావించారని గుర్తు చేసిన బీజేపీ ఎంపీ

# 152 మీటర్ల ఎత్తుతో బరాజ్ నిర్మాణానికి అంగీకరించాలి

### వాస్తవాలు, సాంకేతిక అంశాల ఆధారంగా తదుపరి నిర్ణయం తీసుకుంటామని వెల్లడి

- తెలంగాణ నీటి అవసరాలకు సహకరించడానికి ఎలాంటి అభ్యంతరం లేదన్న ఫడ్నవీస్
- అయితే మహారాష్ట్ర ప్రయోజనాల పరిరక్షణకే ప్రాధాన్యం అని స్పష్టీకరణ
- తుది నిర్ణయానికి వచ్చే ముందు పలు అంశాలపై అధ్యయనం చేయాల్సి ఉందని వ్యాఖ్య
- రెండు రాష్ట్రాల నీటిపారుదల అధికారులతో కమిటీ ఏర్పాటుకు ప్రతిపాదన
- గిరిజనులు, ఆదివాసీల జీవితాల్లో వెలుగులు నింపాల్సిన అవసరం ఉందన్న రేవంత్



హైదరాబాద్: తెలంగాణ, మహారాష్ట్రల పరస్పర ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని రెండు రాష్ట్రాల సరిహద్దులో ప్రాణహిత నదిపై 152 మీటర్ల ఎత్తుతో తుమ్మిడిహెట్టి బరాజ్ నిర్మాణానికి సహకరించాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి చేసిన విజ్ఞప్తిపై మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ సానుకూలంగా స్పందించారు. తుమ్మిడిహెట్టి బరాజ్ ఎత్తును పెంచాలన్న తెలంగాణ అభ్యర్థనను మిగతా 2 లో




## గ్రావిటీతో నీళ్లిస్తే రాజీనామా చేస్తా ప్రభుత్వానికి హరీశ్‌రావు సవాల్

- తుమ్మిడిహెట్టి నుంచి గ్రావిటీతో నీళ్లు తెస్తే రాజీనామా చేస్తానన్న హరీశ్
- ప్రస్తుత కరవు కాంగ్రెస్ తెచ్చిన కరవు అని విమర్శ
- తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు డీపీఆర్‌ను బహిర్గతం చేయాలని డిమాండ్

## ఎల్ నినో పై అప్రమత్తంగా ఉండాలి

### - చైర్ పర్సన్ కుడుముల రజిత వెంకటేష్



వికారాబాద్ జిల్లా పరిగి (మహి న్యూస్) : దేశవ్యాప్తంగా నెలకొన్న ఎల్ నినో కరువు పరిస్థితి పై మున్సిపల్ ప్రజా ప్రతినిధులు అంతా అప్రమత్తంగా ఉండి ప్రణాళిక బద్ధంగా ఎదుర్కోవాలని పరిగి మున్సిపల్ చైర్ పర్సన్ రజిత వెంకటేష్ తెలిపారు ఈరోజు మున్సిపల్ కార్యాలయంలో ఎల్ నినో పరిస్థితుల పై సర్వసభ్య సమావేశం నిర్వహించారు ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో భూగర్భ జలాలు అడుగంటడం మరియు రానున్న వేసవి కాలంలో త్రాగునీటి కొరత వంటి సమస్యలపై ముందస్తు చర్యలను తీసుకునేందుకు అవసరమైన సలహాలను సూచనలని సభ్యుల నుంచి తీసుకొని అమలు చేసి ప్రజలకు ఇబ్బంది కలగకుండా చూడాలని ఈ కార్యక్రమంలో కోరారు కరువు పరిస్థితులపై ప్రణాళిక బద్ధంగా ముందుకు వెళ్దామని అన్నారు, అధికారులు కూడా అప్రమత్తంగా ఉండి ప్రజలందరికీ సేవలు అందించాలని వాస్తవాలను వివరించి అపోహలను వదంతులను నమ్మకుండా అవగాహన కార్యక్రమాలను కల్పించాలని కోరారు కరువు పరిస్థితులపై అప్రమత్తంగా ఉండి సమిష్టిగా ఎదుర్కొనేందుకు సహకరించాలని కోరారు ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ హనుమంతు కౌన్సిలర్లు , అయూబ్,ఎజాస్,చంద్రయ్య, శ్రీనివాస్ రవికుమార్, రవీంద్ర,భాస్కర్ కోఆప్షన్ సభ్యులు ఆంజనేయులు అక్బర్ హుస్సేన్ మున్సిపల్ అధికారులు పాల్గొనడం జరిగింది

## సీఎం రిలీఫ్ ఫండ్ పేద ప్రజలకు వరం లాంటిది

### -మండల పార్టీ అధ్యక్షుడు జి వెంకట రాములు



వికారాబాద్ జిల్లా పరిగి (మహి న్యూస్):: పరిగి మండల పరిధిలోని లక్నాపూర్ గ్రామానికి చెందిన నర్సింహులు అనే వ్యక్తికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును పరిగి మండల పార్టీ అధ్యక్షుడు జీ వెంకటరాముల అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీఎం రిలీఫ్ ఫండ్ పేద ప్రజలకు వరం లాంటిదని ఆపత్కాలంలో వారి కుటుంబ సభ్యులను ఆదుకుంటుందని పేర్కొన్నారు. పేద ప్రజలు ఇబ్బందుల గురవుతున్న సమయంలో సీఎం రిలీఫ్ ఫండ్ వారి ఆరోగ్యాలను కాపాడుతున్నదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పరిగి నియోజకవర్గ యువ నాయకుడు ఎండి నవాజ్, లక్మాపూర్ గ్రామ సర్పంచ్ సందీప్ పటేల్, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి రామచంద్ర రెడ్డి తదితరులు పాల్గొన్నారు

## పోలీస్ ఫ్లాగ్ డే కార్యక్రమాలలో భాగంగా పరిగిలో క్యాండిల్ ర్యాలీ

### - పోలీస్ అమరవీరులకు నివాళులర్పించిన జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, ఐపీఎస్



వికారాబాద్ జిల్లా పరిగి (మహి న్యూస్): పోలీస్ ఫ్లాగ్ డే కార్యక్రమాల్లో భాగంగా పరిగిలో నిర్వహించిన క్యాండిల్ ర్యాలీలో జిల్లా ఎస్పీ శ్రీమతి స్నేహ మెహ్రా, ఐపీఎస్ పాల్గొని పోలీస్ అమరవీరులకు నివాళులర్పించారు. పరిగి బస్టాండ్ నుంచి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం వరకు ఈ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ తో పాటు అదనపు ఎస్పీ శ్రీ రాజేష్ మీనా, పరిగి డీఎస్పీ శ్రీనివాస్ , డీటీసీ డీఎస్పీ శ్రీనివాసులు , పరిగి కొండల్ రెడ్డి సీఐ, కొడంగల్ చంద్ర శేఖర్ రెడ్డి , ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. ర్యాలీ అనంతరం అంబేద్కర్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన అమర వీరుల ఫ్లెక్సీకి జిల్లా ఎస్పీ , అదనపు ఎస్పీ , ఇతర పోలీస్ అధికారులు, విద్యార్థులు నివాళులర్పించి, దేశం కోసం, ప్రజల రక్షణ కోసం విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరించుకున్నారు. ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ కోసం పోలీస్ సిబ్బంది అందిస్తున్న సేవలను ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ శ్రీమతి స్నేహ మెహ్రా, ఐపీఎస్ మాట్లాడుతూ, పోలీస్ అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని, వారి సేవలు ప్రతి పోలీస్ అధికారి, సిబ్బందికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. అమరవీరుల త్యాగస్ఫూర్తిని ఆదర్శంగా తీసుకొని ప్రజలకు అంకితభావంతో సేవలందించాలని సూచించారు. అమరవీరుల కుటుంబాలకు సమాజం అండగా నిలవాలని అన్నారు. యువతలో దేశభక్తి, క్రమశిక్షణ, సామాజిక బాధ్యతను పెంపొందించేందుకు పోలీస్ ఫ్లాగ్ డే కార్యక్రమాలు దోహదపడతాయని ఎస్పీ తెలిపారు. పోలీస్ అమరవీరుల ఆశయాలకు అనుగుణంగా ప్రజల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ నిరంతరం సేవలందించడమే వారికి అర్పించే నిజమైన నివాళి అని జిల్లా ఎస్పీ పేర్కొన్నారు.

## చిన్నమండెం ఎంపీపీగా మండిపల్లి హరితమ్మ ఏకగ్రీవ ఎన్నిక

### మండల సమగ్ర అభివృద్ధికి ప్రాధాన్యత.

### ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం



గాలివీడు/ చిన్నమండ్యం :27 అక్టోబర్ (మహి న్యూస్ ): చిన్నమండెం మండల పరిషత్ అధ్యక్షురాలిగా (ఎంపీపీ) మండిపల్లి హరితమ్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా మండల ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తూ, చిన్నమండెం మండల సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తానని ఆమె పేర్కొన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పన, గ్రామీణ రహదారుల అభివృద్ధి, తాగునీటి సమస్యల పరిష్కారం, ప్రభుత్వ పాఠశాలల్లో వసతుల మెరుగుదల, వైద్య సేవల విస్తరణకు ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలిపారు. రైతుల సమస్యల పరిష్కారం, మహిళా సాధికారత, యువతకు ఉపాధి అవకాశాల ప్రోత్సాహం, గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణతో పాటు అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తానని వెల్లడించారు. ప్రజాప్రతినిధులు, అధికారుల సమన్వయంతో ప్రజల అవసరాలను గుర్తించి, వారి సమస్యలకు పరిష్కారం చూపేలా అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తానని మండిపల్లి హరితమ్మ గ తెలిపారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలియజేస్తూ, ప్రజల ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తానని పేర్కొన్నారు.

# పిల్లలకు పంటల పాఠాలు

## ప్రకృతి, పంటలపై చిన్నారుల్లో ఆసక్తి పెంచేలా అవని ఈ-లెర్నింగ్ యాప్

## ఐఐటీ రోపార్, అన్నమ్.ఏఐ ద్వారా అందుబాటులోకి డిజిటల్ వేదిక




స్పెషల్ డెస్క్ : మనకు ఆహారాన్ని అందించే వ్యవసాయం గురించి, మనం తినే పంటల గురించి పిల్లలకు చిన్నతనం నుంచే అవగాహన కల్పించే ఉద్దేశంతో పంజాబ్‌లోని ఐఐటీ రోపార్ ఒక వినూత్నమైన డిజిటల్ వేదికను అందుబాటులోకి తెచ్చింది. అవని--గ్రో విత్ నేచర్ పేరుతో తెచ్చిన ఈ--లెర్నింగ్ యాప్‌ను డిజిటల్ వ్యవసాయ ఏఐ కేంద్రం అన్నమ్.ఏఐ రూపొందించింది. భారతీయ వ్యవసాయ రంగానికి ఏఐ ఆధారిత డిజిటల్ వ్యవస్థను నిర్మించడంలో భాగంగా కేంద్ర విద్యాశాఖ సహకారంతో ఈ ప్రాజెక్టును చేపట్టారు. ప్రస్తుతం ఈ యాప్ వెబ్‌సైట్ రూపంలోనూ, మొబైల్ యాప్‌గానూ అందరికీ ఉచితంగా లభిస్తోంది.

### పుస్తకాలకు అతీతంగా ప్రత్యక్ష అభ్యాసం

పాఠశాలల్లో వ్యవసాయం ఒక పాఠ్యాంశంగా మొదలవక ముందే పిల్లల్లో ప్రకృతిపై, పంటలపై సహజమైన ఆసక్తిని పెంపొందించడమే ఈ యాప్ ప్రధాన ఉద్దేశం. సాధారణంగా పిల్లలు పుస్తకాల్లో చదవడం లేదా విషయాలను బట్టీ పడుతుంటారు. కానీ ఈ యాప్ ద్వారా పిల్లలు తమ ఇల్లు, బడి, తోట లేదా ఇరుగుపొరుగున పెరిగే మొక్కలను ప్రత్యక్షంగా పరిశీలించి నేర్చుకుంటారు. దీనివల్ల మనం రోజూ తినే ఆహారం ఎక్కడి నుంచి వస్తుంది? అది ఎలా పండుతుందనే ప్రాథమిక విషయాలు పిల్లలకు సులభంగా అర్థమవుతాయి. మనకు అన్నం పెట్టే వ్యవసాయంపై చిన్నతనం నుంచే పిల్లల్లో గౌరవం పెంచడానికి ఇది ఎంతో దోహదపడుతుంది.

### ఏఐ సాంకేతికత తోడుగా..

ఈ యాప్‌లో అత్యాధునిక ఏఐ సాంకేతికతను ఉపయోగించారు. పిల్లలు ఏదైనా మొక్క, పండు లేదా పంటను తమ ఫోన్ కెమెరా ద్వారా చూపిస్తే చాలు, ఏఐ దానిని తక్షణమే గుర్తించి ఆ పంటకు సంబంధించిన పూర్తి వివరాలను అందిస్తుంది. అందులో ధాన్యాలు, చిరుధాన్యాలు, పప్పుధాన్యాలు, నూనెగింజలు, కూరగాయలు, పండ్లు, సుగంధ ద్రవ్యాలు సహా 107కుపైగా పంటలు, మొక్కల రకాల సమాచారాన్ని పొందుపరిచారు. పిల్లలు ప్రతిరోజూ ఆసక్తిగా నేర్చుకోవడానికి వీలుగా దైనందిన అనుభవాలు, వారు చూసిన వివరాలను దాచుకోవడానికి డిజిటల్ నేచర్ బుక్, నేచర్ గ్యాలరీ, వేర్వేరు పంటల మధ్య తేడాలను తెలుసుకోవడానికి క్రాప్ కంపేర్ వంటి ఫీచర్లు ఇందులో ఉన్నాయి.

### పిల్లల భద్రత, డిజిటల్ సౌకర్యాలు

చిన్నారులు సులభంగా ఉపయోగించేలా ఈ యాప్‌లో అనేక సౌలభ్యాలు కల్పించారు. ప్రస్తుతం ఇది హిందీ, ఇంగ్లిష్ భాషల్లో అందుబాటులో ఉంది. ఇంకా చదవడం రాని చిన్న పిల్లల కోసం ప్రత్యేకంగా ఆడియో సౌకర్యాన్ని కూడా అందించారు. అత్యంత ముఖ్యమైన విషయం ఏమిటంటే ఇందులో పిల్లల భద్రతకు, వారి వ్యక్తిగత గోప్యతకు అత్యధిక ప్రాధాన్యం ఇచ్చారు. ఎటువంటి వ్యాపార ప్రకటనలు లేకుండా పూర్తి ఉచితంగా లభించే ఈ యాప్, పిల్లలకు ప్రకృతిని దగ్గర చేస్తూ వారిని బాధ్యతాయుతమైన పౌరులుగా తీర్చిదిద్దడంలో కీలకపాత్ర పోషిస్తుంది.

# బెంబేలెత్తిస్తున్న ఎల్‌నినో

### అంతకంతకూ వేడెక్కుతున్న పసిఫిక్

### 30 డిగ్రీ సెల్సియస్‌కు ఉపరితల ఉష్ణోగ్రతలు

### మరింత పెరిగేందుకు అవకాశముందన్న శాస్త్రవేత్తలు



ఈ ఏడాది నైరుతి రుతు పవనాలను మింగేసి వర్షాభావాన్ని రుచిచూపిస్తున్న ఎల్‌నినో అంతకంతకూ బలపడుతోంది. చరిత్రలోనే మొట్టమొదటిసారి పసిఫిక్ మహా సముద్ర ప్రాంతంలోని ఉపరితల ఉష్ణోగ్రతలు 30 డిగ్రీ సెల్సియస్‌కు చేరుకున్నట్లు శాస్త్రవేత్తలు గుర్తించారు. అక్టోబరు 22న ఈ స్థాయి ఉష్ణోగ్రతలు నమోదు కాగా.... ఇప్పుడిప్పట్లో తగ్గే సూచనలు కూడా లేవని, మరింత ఎక్కువ అయ్యే అవకాశాలు ఉన్నాయన్న హెచ్చరికలు ఆందోళనకు కారణమవుతోంది. దక్షిణ అమెరికా ప్రాంతంలో పసిఫిక్ మహా సముద్రపు ఉపరితల ఉష్ణోగ్రతల్లో వచ్చే మార్పులు ప్రపంచవ్యాప్తంగా వాతావరణాన్ని ప్రభావితం చేస్తాయని మనకు తెలుసు. ఉష్ణోగ్రతలు పెరిగితే ఎల్‌నినో అని, తగ్గితే లా--నినా అని పిలుస్తూంటారు. దశాబ్దాలుగా ఈ రెండు వాతావరణ దృగ్?వషయాలు కొన్నేళ్ల విరామంతో వస్తూ, పోతూ ఉండటం సహజంగానే జరుగుతోంది. అయితే భూతాపోన్నతి, కాలుష్యం వంటి అనేకానేక కారణాలతో ఇటీవలి కాలంలో ఎల్‌నినోలు తరచుగా వస్తూండటం గమనార్హం. ఎల్‌నినో లాంటి పరిస్థితులు ఏర్పడిన చాలా సందర్భాల్లో భారతదేశానికి అత్యంత కీలకమైన నైరుతి రుతుపవనాల ప్రభావం గణనీయంగా తగ్గిపోతూంటుంది. వర్షాభావం, అకాల వర్షాలు, వరదలు, కుంభవృష్టి వంటివి సంభవిస్తూంటాయి. అయితే ఇప్పటివరకూ వచ్చిన ఎల్‌నినోలు ఒక ఎత్తు అయితే 2026లోని ఎల్‌నినో ఇంకో ఎత్తు అంటున్నారు శాస్త్రవేత్తలు. ప్రపంచ వాతావరణ విభాగం కూడా కొన్ని నెలలుగా ఈ ఏడాది వచ్చేది సూపర్ ఎల్‌నినో అని, దీని ప్రభావం వచ్చే ఏడాది వరకూ కొనసాగినా ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదని ఇప్పటికే పలుమార్లు హెచ్చరికలు జారీ చేసింది. ఈ నేపథ్యంలోనే పసిఫిక్ మహా సముద్రంలోని నిర్దిష్ట ప్రాంతంలో ఉపరితల ఉష్ణోగ్రతలు 30 డిగ్రీ సెల్సియస్‌కు చేరుకోవడానికి ప్రాధాన్యం ఏర్పడింది. అంతేకాదు... రానున్న డిసెంబరు వరకూ ఉష్ణోగ్రతల పెరుగుదల కొనసాగే అవకాశం ఉందని ప్రపంచ వాతావరణ విభాగం కూడా స్పష్టం చేస్తోంది. నినో 3.4 (ఎల్‌నినో కోసం శాస్త్రవేత్తలు ఉష్ణోగ్రతలు లెక్కించే ప్రాంతం) వద్ద జూన్ నెలలో సగటు ఉష్ణోగ్రతల పెరుగుదల సాధారణం కంటే 1.6 డిగ్రీ సెల్సియస్ ఎక్కువగా నమోదైంది. ఆగస్టు నాటికి ఇది 2.5 డిగ్రీ సెల్సియస్‌కు చేరుకుంది. అక్టోబరు -- డిసెంబరు మధ్యకాలంలో 3.7 డిగ్రీ సెల్సియస్ వరకూ పెరగవచ్చునని ప్రపంచ వాతావరణ విభాగం అంచనా వేస్తోంది. 2015 నవంబరు నుంచి 2016 జనవరి వరకూ ఈ ప్రాంతపు ఉష్ణోగ్రతలు 2.6 డిగ్రీ సెల్సియస్ వరకూ పెరిగి సృష్టించిన రికార్డు ఈ ఏడాది బద్దలవుతోందన్నమాట.

### మనపై ప్రభావం ఎంత?

ఈ ఏడాది ఎల్ నినో కారణంగా నైరుతి రుతుపవనాల ప్రభావం గణనీయంగా తగ్గిపోయిన విషయం తెలిసిందే. దేశవ్యాప్తంగా దీర్ఘకాలిక సగటు కంటే దాదాపు 13 శాతం తక్కువ వర్షాలు నమోదయ్యాయి. అంతేకాకుండా అక్టోబరు నెలలో సగటు ఉష్ణోగ్రతలు కూడా సాధారణం కంటే ఎక్కువగా నమోదయ్యాయి. రానున్న మూడు నెలల్లోనూ చాలా చోట్ల సాధారణం కంటే తక్కువ వర్షాలు నమోదయ్యే అవకాశముందని భారతీయ వాతావరణ విభాగం చెబుతోంది. ఎల్ నినో పరిస్థితులకు మరికొన్ని అంశాలు తోడు కావడం వల్ల ఈ రకమైన పరిస్థితులు ఏర్పడతాయన్నది తెలిసిన విషయమే. ఈ ఏడాది ఎల్ నినో పరిస్థితులు డిసెంబరు వరకూ కొనసాగే అవకాశం ఉండటంతో దీని ప్రభావం ఎలా ఉండబోతోందో వేచి చూడాల్సిందే.

# స్క్రీన్‌లోంచి సువాసనలు!

### ఫలించిన శాస్త్రవేత్తల ప్రయత్నం

### 'సెంట్రోనిక్' టెక్నాలజీ ఆవిష్కరణ

### మార్కెట్‌లోకి అప్పుడే కాదు

### ప్రస్తుతానికి 5 రకాల వాసనలే!



ఇంటర్నెట్ ఇకపై కేవలం ఆడియోలు, వీడియోలను మాత్రమే కాదు.. మనకు ఇష్టమైన సువాసనలను కూడా మైళ్ల దూరాన్నుంచి క్షణాల్లో అందించబోతోంది! ఈ దిశగా అమెరికాలోని ఒహాయో స్టేట్ యూనివర్సిటీకి చెందిన శాస్త్రవేత్తల బృందం భారీ ముందడుగు వేసింది. చైనాకు చెందిన డాక్టర్ చున్యు యాంగ్ నేతృత్వంలో రూపుదిద్దుకున్న 'సెంట్రోనిక్' అనే ఈ ఆఘ్రాణ సాంకేతికత వివరాలను ప్రముఖ సైన్స్ జర్నల్ 'సైన్స్ అడ్వాన్సెస్' తనతాజా సంచికలో ప్రచురించింది.

### వేల మైళ్ల దూరం నుంచి..

అజయ్ తన ల్యాప్‌టాప్ ముందు కూర్చుని, అమెరికాలో ఉన్న స్నేహితుడు విక్రమ్‌తో వీడియో కాల్ మాట్లాడుతున్నాడు. అప్పుడే విక్రమ్ టేబుల్ మీదకు వేడివేడిగా పొగలు కక్కుతున్న కాఫీ కప్పు వచ్చింది. అంతే! ఇక్కడ ఇండియాలోని అజయ్ ముక్కుపుటాలను, అక్కడ అమెరికాలో విక్రమ్ టేబుల్ మీదకు వచ్చిన కమ్మటి కాఫీ పరిమళం గమ్మత్తుగా తాకింది. 'ఓయ్ విక్రమ్, నీ కాఫీ సువాసన భలే బాగుంది' అన్నాడు అజయ్ ముక్కులు ఎగబీలుస్తూ! ఈ అద్భుతాన్ని సాధ్యం చేసే టెక్నాలజీనే.. 'సెంట్రోనిక్'.

### ఎలా పని చేస్తుంది?

సెంట్రోనిక్ టెక్నాలజీ వ్యవస్థలోని 'ఎలక్ట్రానిక్ నోస్'.. వాసనలను గుర్తించి, ఏఐ సహాయంతో వాటిని డిజిటల్ డేటాగా మారుస్తుంది. ఈ సమాచారం నెట్ ద్వారా అవతలి వైపు ఉన్న రిసీవింగ్ పరికరానికి చేరుతుంది. అక్కడ ఉన్న చిన్న లిక్విడ్ సెంట్, మైక్రో--అటామైజర్స్ (స్ప్రేయర్లు) ద్వారా 'అచ్చం అలాంటి వాసనే' గదిలో వ్యాపిస్తుంది. అంటే, డిజిటల్ సిగ్నల్స్ ఆధారంగా అవతలి పరికరం కాఫీలా అనిపించే సువాసనను వెదజల్లుతుంది. ఒహాయో స్టేట్ వర్సిటీ, చైనాలోని జెజియాంగ్ ల్యాబొరేటరీ పరిశోధకులు సంయుక్తంగా అభివృద్ధి చేసిన ఈ 'సెంట్రోనిక్' ఒక ఆఘ్రాణ వ్యవస్థ. ఇది ఈ--నోస్ (ఎలక్ట్రానిక్ నాసిక), మెషీన్--లెర్నింగ్ వర్గీకరణ, క్లౌడ్ డేటా ప్రసారం, రిమోట్ సువాసన వెదజల్లే పరికరాల సమ్మిళితం.

### వాసన నేరుగా ప్రసారం కాదు

సెంట్రోనిక్ టెక్నాలజీ వివిధ హార్డ్‌వేర్ భాగాలపై ఆధారపడి పని చేస్తుంది. ఇందులోని ఈ--నోస్ పరికరం వాసనల్లోని రసాయన సమ్మేళనాలను గుర్తించి, విశ్లేషించే ఒక పోర్టబుల్ గ్యాస్ సెన్సర్ శ్రేణి. ఇది సుమారు 6 అంగుళాల వ్యాసం కలిగి ఉంటుంది. రెండో వైపు, సువాసన విడుదల చేసే రిసీవర్లు మణికట్టు పట్టీలు, నెక్లెస్‌లుగా; కప్పులకు అమర్చగలిగినవిగా ఉంటాయి. ఇవి పీజోఎలెక్ట్రిక్ టెక్నాలజీని (యాంత్రిక పీడనాన్ని విద్యుచ్ఛక్తిగా, విద్యుచ్ఛక్తిని యాంత్రిక కదలికగా మార్చే సాంకేతికత) ఉపయోగించి, ఇంచుమించు సరిపోలే సువాసనలను స్థానికంగా వెదజల్లే ఐదు స్ప్రేల అమరికతో ఉంటాయి. అయితే మూలానికి సంబంధించిన వాసన అణువులు ఇంటర్నెట్ ద్వారా ప్రసారం కావు. దానికి బదులుగా, స్థానికంగా సంబంధిత వాసనను ఉద్దీపన చేయటానికి డిజిటల్ డేటా ప్రసారం అవుతుంది.

### వైద్య రంగానికి ఉపయోగం

ప్రస్తుతానికి 'సెంట్రోనిక్' పరికరం కేవలం ఐదు రకాల వాసనలను (కాఫీ, కేక్, బెర్రీ, ఆరెంజ్, రెడ్ వైన్) మాత్రమే గుర్తించి పంపగలదు. అలాగే, వేర్వేరు వాసనలు కలిసిపోయినప్పుడు వాటిని కచ్చితంగా వేరు చేసి గుర్తించడంపై పరిశోధనలు జరగాల్సి ఉంది. ఈ పరికరాన్ని చిన్న సైజులోకి కుదించటం, తక్కువ ఖర్చుతో తయారు చేయడం, దీనిని వాడేటప్పుడు భద్రతా ప్రమాణాలు పాటించడం వంటి అంశాలపై శాస్త్రవేత్తలు దృష్టి పెట్టారు. ఇది మొబైల్ ఫోన్లలో ఒక ఫీచర్‌గా రావడానికి మరి కాస్త సమయం పడుతుంది. అయినప్పటికీ భవిష్యత్తులో ఆన్‌లైన్ షాపింగ్, వర్చువల్ రియాలిటీ, వైద్య రంగంలో (వాసన కోల్పోవటాన్ని పరీక్షించడానికి) ఇది విప్లవాత్మక మార్పులు తెస్తుందని ఆశిస్తున్నారు.

# కోడింగ్ ఒక్కటే సరిపోదు!



ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) వేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో భవిష్యత్తులో విద్యార్థులు, యువ నిపుణులు ఏయే నైపుణ్యాలపై దృష్టి పెట్టాలనే అంశంపై ప్రపంచవ్యాప్తంగా చర్చ జరుగుతోంది. ఈ క్రమంలో చిప్ తయారీ దిగ్గజం ఎన్విడియా సీఈఓ జెన్సెన్ హువాంగ్ చేసిన వ్యాఖ్యలు సాంకేతిక ప్రపంచంలో చర్చకు దారితీశాయి. ఒకవేళ తాను ఇప్పుడు విద్యార్థిని అయితే కోడింగ్‌తో పాటు భౌతిక శాస్త్రానికి (ఫిజిక్స్) అత్యధిక ప్రాధాన్యతనిస్తానని ఆయన స్పష్టం చేశారు.

### కోడింగ్ మాత్రమే సరిపోదు

సాంకేతిక రంగంలో దశాబ్దాలుగా కోడింగ్‌ను అత్యంత కీలకమైన నైపుణ్యంగా పరిగణిస్తున్నారు. అయితే, ఏఐ వ్యవస్థలు కేవలం డిజిటల్ డేటాను ప్రాసెస్ చేసే స్థాయి నుంచి భౌతిక ప్రపంచంతో నేరుగా కార్యకలాపాలు సాగించే స్థాయికి చేరుకుంటున్నాయని హువాంగ్ అభిప్రాయపడ్డారు. 'ప్రస్తుత పరిస్థితుల్లో నేను బహుశా భౌతిక శాస్త్రాన్ని అధ్యయనం చేసేవాడిని' అని పేర్కొన్న హువాంగ్, ప్రపంచం ఎలా పనిచేస్తుందో తెలిపే ప్రాథమిక సూత్రాలను అర్థం చేసుకోవడం కోడింగ్ చేయడం కంటే ముఖ్యమని ఉద్ఘాటించారు. తదుపరి తరం ఆవిష్కరణలు కేవలం సాఫ్ట్‌వేర్ నైపుణ్యాల మీద కాకుండా భౌతిక శాస్త్రం, గణితంపై ఉన్న లోతైన అవగాహన మీద ఆధారపడి ఉంటాయని ఆయన స్పష్టం చేశారు.

### ఎందుకు ఈ మార్పు?

ప్రస్తుతం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగం 'ఫిజికల్ ఏఐ' దిశగా వేగంగా అడుగులు వేస్తోంది. ఏఐ వ్యవస్థలు ఇప్పుడు రోబోటిక్స్, ఆటోమేషన్ వంటి రియల్ వరల్డ్ అప్లికేషన్లలో కీలకంగా మారుతున్నాయి. ఈ నేపథ్యంలో హువాంగ్ చెప్పిన దాని ప్రకారం భవిష్యత్తులో డెవలపర్లు, ఇంజినీర్లకు ఫిజిక్స్ విషయాలపై అవగాహన తప్పనిసరి. కోడింగ్ అనేది ఒక పనిని చేయించడానికి ఉపయోగపడే సాధనం మాత్రమేనని, కానీ యంత్రాలు సురక్షితంగా, సమర్థవంతంగా పనిచేయాలంటే అవి పనిచేసే భౌతిక ప్రపంచంపై పూర్తి అవగాహన ఉండాలని ఆయన నొక్కి చెప్పారు.

# స్పేస్‌ఎక్స్‌తో ఆంత్రోపిక్ మెగా డీల్!




కృత్రిమ మేధ (ఏఐ) రంగంలో అనూహ్య పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. ప్రముఖ ఏఐ స్టార్టప్ ఆంత్రోపిక్, ఎలాన్ మస్క్‌కు చెందిన అంతరిక్ష పరిశోధనా సంస్థ స్పేస్‌ఎక్స్‌తో భారీ డేటా సెంటర్ ఒప్పందాన్ని కుదుర్చుకుంది. తమ క్లాడ్ ఏఐ సేవలకు ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న డిమాండ్‌ను తట్టుకోవడానికి అవసరమైన కంప్యూటింగ్ శక్తిని పొందే లక్ష్యంతో ఆంత్రోపిక్ ఈ నిర్ణయం తీసుకుంది.

కొలోసస్ 1

ఈ ఒప్పందం ప్రకారం, టెన్నెసీలోని మెంఫిస్‌లో ఉన్న స్పేస్‌ఎక్స్ 'కొలోసస్ 1' డేటా సెంటర్ పూర్తి కంప్యూటింగ్ సామర్థ్యాన్ని ఇకపై ఆంత్రోపిక్ వినియోగించుకోనుంది. వాస్తవానికి ఈ కేంద్రాన్ని మస్క్ తన సొంత ఏఐ సంస్థ ఎక్స్‌ఏఐ కోసం నిర్మించారు. కానీ తాజా పరిణామాల నేపథ్యంలో ఇది ఆంత్రోపిక్ చేతుల్లోకి వెళ్తోంది. ఇది 2,20,000 ఎన్విడియా ఏఐ చిప్‌ల మద్దతుతో, దాదాపు 300 మెగావాట్ల కంటే ఎక్కువ విద్యుత్ సామర్థ్యంతో ఈ డేటా సెంటర్ పనిచేస్తుంది. ఈ డేటా సెంటర్ వల్ల క్లాడ్ ప్రో, క్లాడ్ మాక్స్ చందాదారులకు వేగవంతమైన సేవలు అందనున్నాయి. సాఫ్ట్‌వేర్ రాయడం, ఎడిటింగ్, డీబగ్గింగ్ చేయగల క్లాడ్ కోడ్ పరిమితులను కంపెనీ రెట్టింపు చేసింది. ఇకపై బిజీ సమయాల్లోనూ ఎటువంటి అంతరాయం లేకుండా యూజర్లు దీనిని వాడుకోవచ్చు.

### శత్రువుల మధ్య స్నేహం

ఈ ఒప్పందం టెక్ ప్రపంచాన్ని ఆశ్చర్యానికి గురిచేసింది. గతంలో ఆంత్రోపిక్ సీఈఓ డారియో అమోదీపై, ఆ సంస్థ సిద్ధాంతాలపై మస్క్ తీవ్ర విమర్శలు చేశారు. ఆంత్రోపిక్ సంస్థ పాశ్చాత్య నాగరికతను ద్వేషిస్తుందని, అది ఒక కపట సంస్థ అని గత ఫిబ్రవరిలో మస్క్ ఎక్స్ వేదికగా దుమ్మెత్తిపోశారు. అయితే, తాజాగా చేసిన మస్క్ పోస్ట్ భిన్నంగా ఉంది. 'గత వారం ఆంత్రోపిక్ సీఈఓ, తమ సిబ్బందితో సమయం గడిపాను. వారి సామర్థ్యం చూసి ముచ్చటేసింది. వారు సరైన పని చేయడంపై చాలా శ్రద్ధ వహిస్తున్నారు' అని ప్రశంసించారు. మరో కీలక ప్రకటన చేస్తూ, ఎక్స్‌ఏఐని స్వతంత్ర సంస్థగా రద్దు చేస్తున్నానని ఇకపై అది స్పేస్‌ఎక్స్ ఏఐగా మాత్రమే కొనసాగుతుందని స్పష్టం చేశారు.

### వివాదాల కేంద్రంగా మెంఫిస్ డేటా సెంటర్

ఈ ఒప్పందంలో భాగమైన మెంఫిస్ డేటా సెంటర్ ప్రస్తుతం వివాదాల్లో ఉంది. భారీ స్థాయిలో సహజ వాయువును మండించే టర్బైన్లను ఇక్కడ ఏర్పాటు చేయడం వల్ల వాయు కాలుష్యం పెరుగుతోందని పౌర హక్కుల సంఘాలు నిరసన తెలుపుతున్నాయి. ఫెడరల్ అనుమతులు లేకుండానే వీటిని నడుపుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

# అదుపుతప్పిన రోబో.. భయపడ్డ విద్యార్థులు



చైనాలోని జిన్‌జియాంగ్ ఉయ్ఘర్ అటానమస్ రీజియన్‌లోని ఒక పాఠశాలలో క్రీడా దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఒక రోబో అదుపుతప్పి.. విద్యార్థులను భయభ్రాంతులకు గురించి చేసింది. దీనికి సంబంధించిన ఒక వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. విద్యార్థులను అలరించడానికి ఏర్పాటు చేసిన రోబో అకస్మాత్తుగా కిందపడి పోయింది. ఆ తరువాత అక్కడున్న ప్రదర్శనకారులపై కుంగ్-ఫూ కిక్‌లు విసరడం ప్రారంభించింది. దిక్కుతోచని విధంగా.. అడ్డదిడ్డంగా పరుగులు పెట్టింది. మైదానంలో ఉన్నవారు ఆందోళనకు గురయ్యారు. పరిస్థితిని అర్థం చేసుకుని, దానిని కంట్రోల్ చేసే వ్యక్తి పరుగెత్తుకుంటూ వచ్చి రోబోట్‌ను పట్టుకున్నాడు. ఆ తరువాత పరిస్థితి అదుపులోకి వచ్చింది. అయితే మైదానంలోని విద్యార్థులకు ఎలాంటి గాయాలు కాలేదు.

### ఇదే మొదటిసారి కాదు

రోబోలు తడబడటం ఇదే మొదటిసారి కాదు. 2026 మార్చి నెలలో.. చైనాలోని షాన్సీ ప్రావిన్స్‌లో జరిగిన ఒక బహిరంగ నృత్య ప్రదర్శనలో, ఒక హ్యూమనాయిడ్ రోబోట్ ప్రమాదవశాత్తు ఒక చిన్న బాలుడి ముఖానికి తగిలింది. వెంటనే అప్రమత్తమైన.. సిబ్బంది ఆ రోబోను పక్కకు లాగడానికి ప్రయత్నించారు. అయినప్పటికీ.. అది రింగ్ మధ్యలో తన ప్రోగ్రామ్ ప్రదర్శించింది. రష్యా తయారు చేసిన రోబోట్ పేరు 'ఐడల్' . దీనిని 2025 నవంబర్ 10న మాస్కోలోని యారోవిట్ హాల్ కాంగ్రెస్ సెంటర్‌లో జరిగిన టెక్నాలజీ షోకేస్ సందర్భంగా ఆవిష్కరించారు. ప్రారంభంలో మెల్లగా అడుగులు వేసుకుంటూ వేదికపైకి వచ్చిన రోబోట్.. అక్కడున్నవారికి అభివాదం చేస్తున్నట్లు చెయ్యి పైకెత్తింది. ఆ తరువాత ఓ రెండడుగులు ముందుకు వేసి కిందకు పడిపోయింది. దీంతో అక్కడే ఉన్న సిబ్బంది దానిని పైకిలేపి కష్టం మీద తీసుకెళ్లారు. కానీ అనుకున్నదొకటి, అయినది ఒకటిగా జగడంతో.. కార్యక్రమం మధ్యలోనే నిలిచిపోయింది.

### కంపెనీలకు సూచనలు

రోబర్స్ తయారీ లేదా వినియోగం అనేది మంచి చర్య. అయితే వాటికి భావాలు అర్థం చేసుకోవడం, ప్రవర్తించిన విధానం పూర్తిగా తెలిసి ఉండదు. ఇలాంటి సమయంలో రోబోల వల్ల ప్రజలు కొన్ని సమస్యలు ఎదుర్కోవాలి వస్తుంది. కాబట్టి సంస్థలు దీనిని దృష్టిలో ఉంచుకుని రోబోట్స్ తయారు చేయాలి. అంతే కాకుండా..పూర్తిగా టెస్ట్ చేసిన తరువాత వినియోగానికి ఉపయోగించడం మంచిది. లేకుంటే.. ప్రజలకు ఇబ్బంది, తద్వారా కంపెనీ విమర్శలు ఎదుర్కోవాల్సి ఉంటుంది.

# స్మార్ట్‌ఫోన్ తయారీలోకి ఓపెన్‌ఏఐ ఎంట్రీ?

## 2027 నాటికి ఏఐ ఏజెంట్ ఫోన్ విడుదల!



ప్రపంచవ్యాప్తంగా టెక్ విప్లవానికి నాంది పలికిన ఓపెన్‌ఏఐ సంస్థ ఇప్పుడు స్మార్ట్‌ఫోన్ మార్కెట్‌లోకి ప్రవేశించనుందనే వార్తలొస్తున్నాయి. యాపిల్, శామ్‌సంగ్ వంటి దిగ్గజాలకు గట్టి పోటీ ఇచ్చేందుకు సిద్ధమవుతున్న ఈ సంస్థ తన సరికొత్త ఏఐ ఏజెంట్ ఫోన్‌ను అభివృద్ధి చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. కేవలం యాప్‌ల మీద ఆధారపడకుండా కృత్రిమ మేధ ద్వారా నేరుగా పనులను పూర్తి చేసేలా ఈ ఫోన్‌ను రూపొందిస్తున్నట్లు తెలుస్తుంది. అయితే, ఈ అంశాలను అధికారికంగా కంపెనీ ఇంకా ధ్రువీకరించాల్సి ఉంది.

### ఏమిటీ ఏఐ ఏజెంట్ ఫోన్?

ప్రస్తుత స్మార్ట్‌ఫోన్‌ల్లో మనం ఒక పని కోసం వివిధ యాప్‌లను ఓపెన్ చేయాల్సి ఉంటుంది. కానీ, ఓపెన్‌ఏఐ అభివృద్ధి చేస్తున్న ఈ ఏజెంట్ ఫోన్ ఆ పద్ధతినే మార్చేయనుంది. ఇందులో యూజర్లు పనులను పూర్తి చేయడానికి ఏజెంట్ పైన ఆధారపడతారు. అంటే, ఫోన్‌లోని ఏఐ యూజర్ తరపున వివిధ యాప్‌ల మధ్య నావిగేట్ చేస్తూ పనిని పూర్తి చేస్తుంది. ఈ టెక్నాలజీ భవిష్యత్తులో మొబైల్ వినియోగ విధానాన్ని పూర్తిగా మార్చనుంది.

### లీక్ అయిన స్పెసిఫికేషన్స్

ప్రముఖ టెక్ విశ్లేషకుడు మింగ్-చి కుయో వెల్లడించిన వివరాల ప్రకారం, 'ఈ స్మార్ట్‌ఫోన్ అత్యున్నత ప్రమాణాలతో రూపుదిద్దుకుంటోంది. అందుకోసం మీడియాటెక్ ప్రాసెసర్‌తో ఓపెన్‌ఏఐ భాగస్వామ్యం కుదుర్చుకుంది. ఇది డైమెన్సిటీ 9600 ప్రాసెసర్‌పై పనిచేయనుంది. టీఎస్‌ఎంసీ అధునాతన చీ2గా (2ఎఎ) నోడ్ సాంకేతికతతో ఈ చిప్ తయారవుతుంది. ఇందులో డ్యూయల్-ఎన్‌పీయూ ఆర్కిటెక్చర్ ఉంటుంది. ఇది సంక్లిష్టమైన ఏఐ గణనలను వేగంగా పూర్తి చేస్తుంది. వేగవంతమైన పనితీరు కోసం ఎల్‌పీడీడీఆర్6 ర్యామ్ యూఎఫ్‌ఎస్ 5.0 స్టోరేజ్ సాంకేతికతను వాడుతున్నారు. ఇన్-లైన్ హ్యాషింగ్ వంటి అత్యాధునిక భద్రతా ఫీచర్లు ఇందులో ఉంటాయి' అన్నారు.

### ఎందుకు ఈ ఫోన్ అవసరం?

ఓపెన్‌ఏఐ ఈ ఫోన్‌ను తీసుకురావడానికి రెండు ప్రధాన కారణాలు కనిపిస్తున్నాయి. ఒకటి.. వ్యాపార వ్యూహం. రాబోయే కాలంలో కంపెనీ ఐపీఓకు సిద్ధమవుతోంది. ఇన్వెస్టర్లను ఆకట్టుకోవడానికి బలమైన ప్రొడక్ట్ స్టోరీ అవసరం. రెండు.. మార్కెట్ ఆధిపత్యం. యాపిల్, గూగుల్, శామ్‌సంగ్ వంటి కంపెనీలు ఏఐ ఫీచర్లను తమ ఫోన్లలో వేగంగా ప్రవేశపెడుతున్నాయి. ఈ పోటీలో వెనుకబడకుండా ఉండాలంటే హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్ రెండింటిపై నియంత్రణ ఉండాలని ఓపెన్‌ఏఐ భావిస్తోంది. ప్రస్తుత సమాచారం ప్రకారం, ఈ స్మార్ట్‌ఫోన్ 2027 మొదటి అర్ధభాగంలో భారీ ఉత్పత్తి దశలోకి వెళ్లనుంది. 2027-2028 మధ్య సుమారు 30 మిలియన్ల యూనిట్లను మార్కెట్లోకి విడుదల చేయాలని ఓపెన్‌ఏఐ లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలుస్తోంది. కంపెనీ ఎగ్జిక్యూటివ్‌లు లేదా సామ్ ఆల్ట్‌మాన్ ఇప్పటివరకు ఈ ప్రాజెక్టును అధికారికంగా ధ్రువీకరించలేదు. ఏదేమైనా ఒక సాఫ్ట్‌వేర్ దిగ్గజం సొంత హార్డ్‌వేర్‌తో వస్తుందంటే అది మొబైల్ పరిశ్రమలో పెను సంచలనమే కానుంది. టెక్ ప్రపంచం ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఈ ఏఐ ఏజెంట్ ఫోన్ స్మార్ట్‌ఫోన్ వినియోగంలో సరికొత్త శకానికి నాంది పలుకుతుందో లేదో చూడాలి.

# ఏఐ, డ్రోన్‌లో ముందుంటాం

**రాబోయే కాలంలో 30--50% వృద్ధి**

**రెవెన్యూ కూడా వెయ్యికోట్లు దాటాలని లక్ష్యిస్తున్నాం**

**స్టాఫింగ్, ఐటీ సేవల నుంచి ఏఐ వైపు అడుగులేస్తున్నాం**

**క్లౌడ్, ఏఐ సర్వేలెన్స్, డ్రోన్లలో కాంట్రాక్టులు దక్కాయి**

**రైల్వేతో పాటు బ్యాంకింగ్, డేటా సెంటర్లకూ సేవలు**



పేరు మాత్రమే కాదు. బిజినెస్ తీరునే మార్చుకుని ఆధునిక డ్రోన్, క్లౌడ్-- ఏఐ సర్వేలెన్స్ రంగాల్లో వడివడిగా అడుగులేస్తున్న మగెలానిక్ క్లౌడ్‌ది నిన్నటిదాకా స్టోరీనే. ఇపుడు ఆ స్టోరీ కార్యాచరణలోకి వస్తోంది. తాజాగా రైల్వే సహా పలు బ్యాంకింగ్ సంస్థల నుంచి సర్వేలెన్స్ కాంట్రాక్టులు దక్కించుకుంది. డ్రోన్ల తయారీలోకి ప్రవేశించాక డిఫెన్స్ నుంచీ కాంట్రాక్టులు దక్కాయి. తమ ప్రణాళికలు పూర్తిగా ఆచరణలోకి రావటానికి ఎక్కువ కాలం పట్టకపోవచ్చంటున్న కంపెనీ సీఎండీ జోసెఫ్ సుదీర్(జో)తో 'సాక్షి' బిజినెస్ ప్రతినిధి ప్రత్యేకంగా మాట్లాడారు.

**మీ బిజినెస్ వర్టికల్స్‌లో ఆదాయం పరంగా ముందున్నవేంటి?**

ఇప్పుడైతే స్టాఫింగ్, ఐటీ సేవలనేవి మొదటి వరుసలో నిలుస్తాయి. ఏఐ--ఇన్నోవేషన్‌పై ఫోకస్ చేస్తుంది. ఏఐ ఆధారిత అడ్వాన్స్‌డ్ సొల్యూషన్స్‌ను రూపొందిస్తున్నాం. రెవెన్యూ పరంగా దీనిదిపుడు రెండో స్థానం. డ్రోన్ తయారీలోకి కూడా ప్రవేశించాం. లాజిస్టిక్స్, డిఫెన్స్, కమర్షియల్ సర్వీసుల కోసం కస్టమైజ్డ్ డ్రోన్లను రూపొందిస్తున్నాం. ఇపుడైతే రెవెన్యూలో ఇది చివర్లో ఉంది. కానీ వచ్చే ఒకటి రెండేళ్లలో ఈ ఆర్డర్ పూర్తిగా మారుతుంది.

**మరి ఇలా మారటానికి ఇపుడేం చేస్తున్నారు?**

ఇప్పుడున్న దశలో ఏది ఏ స్థాయిలో అమలవుతోందో పూర్తి వివరాలు చెప్పలేను. కానీ డైరెక్షన్ క్లియర్‌గా ఉంది. రెవెన్యూ పనితీరు మెరుగుపరుచుకోవటంపై ఫోకస్ పెట్టాం. గడిచిన మూడు త్రైమాసికాలుగా వృద్ధికి ఒక బేస్‌ను తయారు చేసుకున్నాం. నంబర్స్ మాత్రం ఇపుడు చెప్పలేను.

**సరే! ఇప్పుడు మీ డ్రోన్ బిజినెస్ ఏ స్థాయిలో ఉంది?**

దీనికి సంబంధించి 15--20 కోట్ల ఆర్డర్‌బుక్ ఉంది. ప్రధానంగా లాజిస్టిక్స్ రంగానివే. డిజైన్ నుంచి ఏఐ ఇంటిగ్రేషన్, టెస్టింగ్, డిప్లాయిమెంట్ వరకూ మేమే చేస్తున్నాం. అవసరాన్ని బట్టి డెలివరీకి 30--45 రోజుల నుంచి మూడు నెలల వరకూ పడుతుంది.

**డ్రోన్ల తయారీలోకి చాలామంది వస్తున్నారు కదా!. మీ స్పెషాలిటీ ఏంటి?**

మేం 200 కిలోల వరకూ పేలోడ్‌ను తీసుకెళ్లే సామర్థ్యం ఉన్న డ్రోన్లను తయారు చేస్తున్నాం. అవరోధాల్ని దాటుకుని ఆటో ల్యాండింగ్ కావటం... జీపీఎస్ లేకున్నా లక్ష్యాన్ని చేరటం... ఎలక్ట్రానిక్ వార్‌ఫేర్‌ను తట్టుకోగలగటం ఈ డ్రోన్ల ప్రత్యేకత. సిగ్నల్ జామ్ అయిన సందర్భాల్లో సైతం ప్రత్యామ్నాయ కమ్యూనికేషన్ వ్యవస్థ, ఇంటర్నల్ నేవిగేషన్ వ్యవస్థల్ని ఉపయోగించుకుని పనిచేయటం వీటి స్పెషాలిటీ.

**మీ రెవెన్యూలో రికరింగ్ ఎక్కువా? లేకుంటే ప్రాజెక్ట్ బేస్డ్ ఎక్కువా?**

దాదాపు 70--80 శాతం రెవెన్యూ రికరింగ్ రూపంలోనే వస్తోంది. ఇవన్నీ 3--5 ఏళ్ల దీర్ఘకాలిక కాంట్రాక్టులు. వీటివల్ల స్థిరత్వం వస్తోంది.

**మీ ఆర్డర్ బుక్, భవిష్యత్ వృద్ధిని వివరంగా చెబుతారా?**

ఈ మధ్య మేం దాదాపుగా రూ.250 కోట్ల రైల్వే కాంట్రాక్టులు దక్కించుకున్నాం. వీటిలో 10 శాతాన్ని ఇప్పటిదాకా పూర్తిచేశాం. భవిష్యత్‌ను దీన్నిబట్టే ఊహించొచ్చు. ప్రస్తుత మార్గాల ద్వారా రెవెన్యూలో 20 శాతం వృద్ధి ఉండొచ్చని అంచనా వేస్తున్నాం.

**మీ బిజినెస్‌లో అంతర్జాతీయ వాటా ఎంత?**

గతేడాది మేం రూ.600 కోట్ల రెవెన్యూ సాధించాం. దీన్లో రూ.400 కోట్లు అంతర్జాతీయ మార్కెట్ల నుంచే వచ్చింది. దీన్లో అత్యధికం అమెరికా నుంచే వచ్చింది. అంతర్జాతీయ క్లయింట్లలో డేటా సెంటర్లు ప్రధానం. వీటికి డేటా ఇంజినీరింగ్, ఏఐ, సైబర్ సెక్యూరిటీ సొల్యూషన్లు అందిస్తున్నాం.

**మీ వ్యాపారంలో ఏఐ పాత్ర ఎంతవరకూ ఉంది?**

అన్నిటికీ ఏఐనే ప్రధానం. ఉదాహరణకు.. బ్యాంకింగ్, ఏటీఎంలకు ఏఐ ఆధారిత వీడియో అనలిటిక్స్ అందిస్తున్నాం. ఆటోమేటెడ్ సర్వేలెన్స్ వ్యవస్థల్లో... రియల్‌టైమ్‌లో అలెర్ట్‌లు పంపటంలో... ఇంప్రూవ్‌మెంట్‌లో అన్నింట్లో ఏఐ ఉంటుంది. డ్రోన్స్, ఐటీ, సర్వేలెన్స్ ఇలా మా వెర్టికల్స్ అన్నింటా ఏఐ తప్పనిసరి.

**మీరు ఈ మధ్య కొన్ని కంపెనీల్ని టేకోవర్ చేశారు కదా? ఫండింగ్ ఎలా?**

ఎక్కువ భాగం ఫండింగ్ అంతర్గత వనరుల నుంచే సమీకరించుకున్నాం. 2023--24లో మాత్రమే కొంత మూలధనం సమీకరించాం. మొత్తంగా చూస్తే బలమైన క్యాష్ ఫ్లో నుంచే ఫండింగ్ చేస్తున్నాం. ఇటీవల డ్రోన్లకు రూ.60 కోట్లు, రైల్వే ప్రాజెక్టులకు రూ.40 కోట్లు, బ్యాంకింగ్-- పీఎస్‌యూ ప్రాజెక్టుల కోసం రూ.100 కోట్లు కేటాయించాం.

**కంపెనీ వృద్ధికి సంబంధించి ఇన్వెస్టర్లు ఏం ఆశించొచ్చు?**

గతేడాది 600 కోట్ల రెవెన్యూ ఉంది. ఈ ఏడాది రూ.850 కోట్లకు చేరుకోవచ్చు. వచ్చే ఏడాది వెయ్యి కోట్లు దాటాలని లక్ష్యిస్తున్నాం. రాబోయే సంవత్సరాల్లో 30--50 శాతం వృద్ధిని అంచనా వేస్తున్నాం. సేవల కంపెనీ నుంచి ప్లాట్‌ఫామ్ ఆధారిత, ఏఐ ఆధారిత వ్యాపారంగా ఎదుగుతున్నాం కనక ఇన్వెస్టర్లు కూడా మంచి వృద్ధిని ఆశించొచ్చు.

# ఏఐ ఉద్యోగాలను మింగేస్తుందా? సృష్టిస్తుందా?



ప్రస్తుత డిజిటల్ యుగంలో కృత్రిమ మేధ(ఏఐ)పై జరుగుతున్న చర్చ అంతా ఇంతా కాదు. ఒకవైపు టెక్నాలజీ వేగంగా విస్తరిస్తుంటే, మరోవైపు సామాన్యుల నుంచి నిపుణుల వరకు అందరిలోనూ ఒకటే ఆందోళన... 'ఏఐ వల్ల మన ఉద్యోగాలు పోతాయా?'. ఈ సందేహాలకు చెక్ పెడుతూ ప్రపంచ అగ్రగామి టెక్ దిగ్గజం ఎన్విడియా సీఈఓ జెన్సెన్ హువాంగ్ ఆసక్తికరమైన విశ్లేషణ చేశారు. 'ఏఐ ఉద్యోగాలను తొలగించదు, బదులుగా కొత్త ఉపాధి మార్గాలను సృష్టిస్తుంది' అని ఆయన స్పష్టం చేశారు.

### ఉద్యోగాల భయంపై హువాంగ్ స్పందన

మిల్కెన్ ఇన్‌స్టిట్యూట్ నిర్వహించిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న హువాంగ్ ఏఐ వల్ల భారీగా ఉద్యోగ నష్టాలు సంభవిస్తాయనే వాదనలను కొట్టిపారేశారు. ఈ తరహా భయాందోళనలు కేవలం అపోహలని, ఇవి ప్రజలను సాంకేతికతకు దూరంగా ఉంచుతాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. 'ఏఐ కేవలం సాఫ్ట్‌వేర్ మాత్రమే కాదు, అదొక పారిశ్రామిక విప్లవానికి నాంది. డేటా సెంటర్లు, అధునాతన హార్డ్‌వేర్, సహాయక ఎకోసిస్టమ్‌ల నిర్మాణం కోసం వేల సంఖ్యలో మానవ వనరుల అవసరం ఉంది. ఆటోమేషన్ అనేది మొత్తం ఉద్యోగాలను తుడిచిపెట్టదు. కేవలం పనితీరులోని నిర్దిష్టమైన, పునరావృతమయ్యే పనులను మాత్రమే మారుస్తుంది. అంటే, మనిషి చేసే మొత్తం పనిలో కొంత భాగాన్ని ఏఐ సాయంతో సులభతరం చేసుకునే అవకాశం ఉంటుందే తప్ప, మనిషి స్థానాన్ని పూర్తిగా భర్తీ చేయదు' అని చెప్పారు.

### ఆందోళనలు ఎందుకు? వాస్తవాలేంటి?

హువాంగ్ ఆశావాద దృక్పథాన్ని వ్యక్తపరిచినప్పటికీ ప్రపంచవ్యాప్తంగా సామాజిక, ఆర్థిక వేత్తలు మాత్రం హెచ్చరికలు జారీ చేస్తూనే ఉన్నారు. వివిధ కన్సల్టింగ్ సంస్థల అంచనాల ప్రకారం, రాబోయే ఐదేళ్లలో దాదాపు 15 శాతం ఉద్యోగ బాధ్యతల్లో మార్పులు లేదా కొన్ని పాత తరహా పాత్రలు కనుమరుగయ్యే అవకాశం ఉందని గణాంకాలు హెచ్చరిస్తున్నాయి. వేగవంతమైన ఏఐ స్వీకరణ వల్ల ఆర్థిక అసమానతలు పెరిగే ప్రమాదం ఉందని, సరైన శిక్షణ లేని వారు ఉపాధి కోల్పోయే అవకాశం ఉందనేది నిపుణుల ప్రధాన ఆందోళన.

### భయం వద్దు.. నైపుణ్యం ముద్దు!

ప్రతి సాంకేతిక మార్పు వెనుక కొంత అనిశ్చితి ఉండటం సహజం. అయితే, టెక్ పరిశ్రమ సృష్టిస్తున్న హైప్‌కు భయపడి పురోగతిని ఆపడం సరికాదని హువాంగ్ సూచిస్తున్నారు. ఏఐని ఒక ముప్పుగా చూడటం కంటే.. మన సామర్థ్యాన్ని పెంచే సాధనంగా చూడాలి అనేది ఆయన మాటల సారాంశం. మొత్తానికి ఏఐ ప్రభావం వల్ల ఉద్యోగ స్వరూపం మారుతుందనేది వాస్తవం. అయితే, కాలంతో పాటు కొత్త నైపుణ్యాలను సంతరించుకునే వారికి ఏఐ ఒక వరం కానుంది. సాంకేతికత పట్ల భయాన్ని వీడి దానిని వాడుకోవడంలోనే భవిష్యత్తు ఉందనేది స్పష్టమవుతోంది.

RNI : APTEL/25/A0108
మహి న్యూస్
www.mahinewsindia.com
తెలుగు దినపత్రిక
epaper: https://epaper.mahinewsindia.com



# కారంపూడి మండలంలో అన్నీ ఏకగ్రీవాలే



కారంపూడి అక్టోబర్ 27: (మహి న్యూస్): కారంపూడి మండలంలోని 15 ఎంపీటీసీ స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. కారంపడి మండలంలో పోటీలో ఉన్న స్వతంత్ర అభ్యర్థులు కూడా మంగళ వారం నామినేషన్ విరమించుకోవడం తో అన్ని స్థానాల్లో ఏకగ్రీవాలకు లైన్ క్లియర్ అయింది. మంగళవారం సాయంత్రం ఉపసంహరణ గడువు ముగియడంతో ఎన్నికల అధికారి కెవిఎన్ ఉపేంద్ర కుమార్ ఏకగ్రీవాలను అధికారికంగా వెల్లడించరు. బీ-ఫారాలు సమర్పించిన వారిని పార్టీల తరఫున విజేతలుగా ప్రకటించారు.మండలంలో 15 ఎంపీటీసీలు సభ్యులు చిన్నగార్లపాడు- గోరిమెళ్ళ సౌజన్య టీడీపీ , చింతపల్లి-గమిడి శ్రీనివాసరావు టీడీపీ,గాదేవారిపల్లి - నల్ల పోతుల కొండ టీడీపీ, కారంపూడి-1 తాండ మస్తాన్ జానీ టీడీపీ, కారంపూడి-2 పలిశెట్టి రజిని టీడీపీ, కారంపూడి-3 పాలెపోగు నిర్మల జనసేన,కారంపూడి -4 బాణావత్ బాలు నాయక్ టీడీపీ, మిరియాల బైనబోయిన వెంకటయ్య టీడీపీ,నరమాలపాడు గోళ్ళ సురేష్ యాదవ్ టీడీపీ, ఒప్పిచర్ల-1 షేక్ సైదాల్లి టీడీపీ, ఒప్పిచర్ల-2 బొల్లినేడి పద్మ టిడిపి, పెద్ద కొదమగుండ్ల కామేపల్లి ఏడుకొండలు జనసేన, పేట సన్నిగండ్ల-1 దారివేముల అనూష జనసేన, పేటసన్నిగండ్ల-2 మామిడి దానయ్య,వేపకంపల్లి మద్దినేని వెంకాయమ్మ పేర్లను ఎంపీటీసీ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

## వినుకొండలో మున్సిపల్ ఎన్నికల ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలి

**స్ట్రాంగ్ రూమ్, డిస్ట్రిబ్యూషన్ సెంటర్, కౌంటింగ్ కేంద్రాల తనిఖీ**

**బ్యాలెట్ బాక్సుల తరలింపునకు స్పష్టమైన ప్రణాళిక రూపొందించాలి**

**వర్షాలు పడితే ఇబ్బందులు లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలి**



పల్నాడు, అక్టోబర్ 27: (మహి న్యూస్): మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి స్ట్రాంగ్ రూమ్, డిస్ట్రిబ్యూషన్ సెంటర్, కౌంటింగ్ కేంద్రాల్లో పకడ్బందీగా ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి కృతిక శుక్ల అధికారులను ఆదేశించారు. మంగళవారం వినుకొండలోని లయోలా హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూములు, కౌంటింగ్ కేంద్రాన్ని, నిర్మల హైస్కూల్‌లోని డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కౌంటింగ్ కేంద్రంలో టేబుళ్లు, బ్యారికేడింగ్ ఏర్పాటు చేయడంతో పాటు నిబంధనల ప్రకారం అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. ఎన్నికల సామగ్రి పంపిణీ సమయంలో





వర్షాలు పడితే ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. కౌంటింగ్ టేబుళ్ల సంఖ్య, కౌంటింగ్ రౌండ్లు, రిసెప్షన్ ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఎలాంటి లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. స్ట్రాంగ్ రూమ్ నుంచి బ్యాలెట్ బాక్సులను కౌంటింగ్ హాళ్లకు తరలించే సమయంలో ఏ పోలింగ్ స్టేషన్‌కు చెందిన బాక్సులను ఏ కౌంటింగ్ టేబుల్ వద్దకు పంపించాలనే అంశంపై స్పష్టమైన ప్రణాళిక రూపొందించాలని తెలిపారు. బ్యాలెట్ బాక్సుల పంపిణీ, తరలింపు ప్రక్రియలో గందరగోళానికి తావులేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. కౌంటింగ్ కేంద్రాల్లో అవసరమైన మౌలిక సదుపాయాలు, సిబ్బందికి వసతులు కల్పించి, నిర్దేశిత గడువులోగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నరసరావుపేట ఆర్డీఓ బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# తుఫాన్ నేపథ్యంలో విద్యుత్ ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

**విద్యుత్ స్తంభాలు, తెగిపడిన తీగలకు దూరంగా ఉండాలి**

**విద్యుత్ అత్యవసర సహాయం కోసం 1912 టోల్‌ఫ్రీ నంబర్**

**జిల్లాల వారీగా కంట్రోల్ రూమ్ నంబర్లు అందుబాటులోకి**

విజయవాడ, అక్టోబర్ 27: (మహి న్యూస్): తుఫాన్ నేపథ్యంలో ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని ఏపీసీపీడీసీఎల్ సీఎండీ పి. పుల్లారెడ్డి అధికారులను ఆదేశించారు. భారీ వర్షాలు, ఈదురుగాలుల కారణంగా విద్యుత్ స్తంభాలు, తీగలు దెబ్బతినే అవకాశం ఉన్నందున అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఏర్పడిన ప్రాంతాల్లో వెంటనే స్పందించి, సాధ్యమైనంత త్వరగా సరఫరాను పునరుద్ధరించాలని తెలిపారు.

### ప్రజలు పాటించాల్సిన విద్యుత్ భద్రతా సూచనలు:

వర్షాలు, ఈదురుగాలుల సమయంలో విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లకు దూరంగా ఉండాలి.

తెగిపడిన విద్యుత్ తీగలను ఎట్టి పరిస్థితుల్లోనూ తాకకూడదు.

నీరు నిలిచిన ప్రాంతాల్లో విద్యుత్ పరికరాలు, స్తంభాల సమీపానికి వెళ్లకూడదు.

ఒరిగిన విద్యుత్ స్తంభాలు, తెగిపడిన తీగలు, ఇతర విద్యుత్ ప్రమాదాలను వెంటనే అధికారుల దృష్టికి తీసుకెళ్లాలి.

విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడితే అత్యవసర సహాయం కోసం ఏపీసీపీడీసీఎల్ టోల్‌ఫ్రీ నంబర్ 1912ను సంప్రదించాలి.

### జిల్లాల వారీగా ఏపీసీపీడీసీఎల్ కంట్రోల్ రూమ్ నంబర్లు:

కృష్ణా: 6281709355
ఎన్టీఆర్: 9440817561
గుంటూరు: 9440817526
బాపట్ల: 9281413774
ప్రకాశం: 9440817491
పల్నాడు: 7661019447

తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా వ్యవస్థను నిరంతరం పర్యవేక్షించాలని, ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సీఎండీ అధికారులకు సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు సకాలంలో సహాయం అందించేందుకు కంట్రోల్ రూమ్‌లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ప్రజలు విద్యుత్ భద్రతా సూచనలు పాటిస్తూ తుఫాన్ సమయంలో అప్రమత్తంగా ఉండాలని ఏపీసీపీడీసీఎల్ విజ్ఞప్తి చేసింది.

# అర్నబ్ తుపాన్‌పై అప్రమత్తంగా ఉండాలి

**తీరానికి దగ్గరగా తుపాన్.. మరో 12 గంటలు అత్యంత అప్రమత్తత అవసరం**

**తూర్పు, పశ్చిమ గోదావరి, కాకినాడ, కోనసీమ, అనకాపల్లి జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు**

**గంటకు 100-140 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం**




అమరావతి, అక్టోబర్ 27: (మహి న్యూస్): అర్నబ్ తుపాన్ తీరానికి దగ్గరగా ఉన్న నేపథ్యంలో రానున్న 12 గంటలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ సూచించారు. తుపాన్ ప్రభావంతో తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, కాకినాడ, కోనసీమ, అనకాపల్లి జిల్లాల్లో బుధవారం ఉదయం వరకు భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. గంటకు 100 నుంచి 140 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని హెచ్చరించారు. పూరిళ్లు, రేకుల షెడ్లలో నివసించే వారు వెంటనే సమీపంలోని పునరావాస కేంద్రాలకు వెళ్లాలని సూచించారు. తుపాన్‌కు సంబంధించిన సమస్యల పరిష్కారం కోసం మనమిత్ర వాట్సాప్ నంబర్ 9552300009ను సంప్రదించాలని తెలిపారు. అత్యవసర సహాయం కోసం విపత్తుల నిర్వహణ సంస్థ టోల్‌ఫ్రీ నంబర్లు 1070, 112, 18004250101కు ఫోన్ చేయాలని ప్రఖర్ జైన్ సూచించారు.

# స్థానిక సంస్థల ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు

**స్ట్రాంగ్ రూమ్‌లు, పంపిణీ కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్ సి.యం. సాయికాంత్ వర్మ**

**ఎన్నికల సామగ్రి కొరత లేకుండా చూడాలని అధికారులకు ఆదేశాలు**

**ట్రాఫిక్ సమస్యలు లేకుండా, సీసీ కెమెరాలతో పటిష్ట నిఘా ఏర్పాటు చేయాలని సూచన**





గుంటూరు, అక్టోబర్ 27: (మహి న్యూస్): స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో భాగంగా స్ట్రాంగ్ రూమ్‌లు, ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాలను జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి సి.యం.



సాయికాంత్ వర్మ మంగళవారం తనిఖీ చేశారు. గుంటూరు నగరపాలక సంస్థ ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రంగా ఆంధ్రా ముస్లిం కళాశాలను వినియోగిస్తుండగా, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాలలో స్ట్రాంగ్ రూమ్‌లు, కౌంటింగ్ కేంద్రాల ఏర్పాట్లను పరిశీలించారు. జిల్లా పరిషత్ ఎన్నికలకు కూడా అదే కళాశాలలో ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రంలో అన్ని వస్తువులు పూర్తి స్థాయిలో అందుబాటులో ఉండాలని, ఎలాంటి కొరత ఉండకూడదని ఆదేశించారు. ఎన్నికల సిబ్బందికి అల్పాహారం, మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేయాలని, రూట్ల వారీగా వాహనాలను సిద్ధంగా ఉంచాలని సూచించారు. ప్రిసైడింగ్ అధికారులు (పీఓలు), అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు (ఏపీఓలు), ఇతర సిబ్బంది హాజరును పరిశీలించాలన్నారు. ఎన్నికల సామగ్రి స్వీకరణ కేంద్రం వద్ద వాహనాల రాకపోకలకు స్పష్టమైన మార్గాలు ఏర్పాటు చేయాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఎన్నికల సిబ్బంది వాహనాల నుంచి దిగిన వెంటనే ఎలాంటి ఆలస్యం లేకుండా సామగ్రిని అప్పగించేలా రిసెప్షన్ కౌంటర్ల వద్ద తగినంత సిబ్బందిని నియమించాలని ఆదేశించారు. స్ట్రాంగ్ రూమ్‌లు, కౌంటింగ్ హాళ్ల వద్ద సీసీ కెమెరాల ఏర్పాటు పక్కాగా ఉండాలని, మీడియా కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని సూచించారు. ఎన్నికల సిబ్బందికి నాణ్యమైన ఆహారం అందించడంతో పాటు, పంపిణీ, స్వీకరణ కేంద్రాల వద్ద ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని, ఓట్ల లెక్కింపు సజావుగా జరిగేందుకు ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ తనిఖీల్లో రెవెన్యూ డివిజనల్ అధికారి కె. శ్రీనివాసరావు, నగరపాలక సంస్థ పర్యవేక్షక ఇంజనీర్ వెంకటేశ్వరరావు, సీపీఓ రాంబాబు, డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్, గ్రామీణ నీటి సరఫరా విభాగం పర్యవేక్షక ఇంజనీర్ కె. కళ్యాణ చక్రవర్తి, జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారి జి. శ్రీనివాస్, విద్యుత్ శాఖ పర్యవేక్షక ఇంజనీర్ సి.హెచ్. రమేష్, డీఎస్పీలు ఎస్. కాంతారావు, వెంకటేశ్వర్లు, మెప్మా పీఓ సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

# ఆర్నబ్ తుఫానుపై అప్రమత్తంగా ఉండాలి

**ఒక్క ప్రాణనష్టం కూడా జరగకుండా చర్యలు చేపట్టాలి**

**రైతులు, పంటలు, పశుసంపద రక్షణకు ముందస్తు ఏర్పాట్లు**

**లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలి**

**మూడు జిల్లాల అధికారులతో మంత్రి అచ్చెన్నాయుడు సమీక్ష**



అమరావతి, అక్టోబర్ 27: (మహి న్యూస్): ఆర్నబ్ తుఫాను నేపథ్యంలో ఒక్క ప్రాణనష్టం కూడా జరగకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని రాష్ట్ర వ్యవసాయ, పశుసంవర్ధక, మత్స్యశాఖల మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అధికారులను ఆదేశించారు. రైతులు, పంటలు, పశుసంపద, ప్రజల ఆస్తులకు నష్టం తగ్గించేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. మంగళవారం శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, జాయింట్ కలెక్టర్లు, వివిధ శాఖల అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి తుఫాను ముందస్తు ఏర్పాట్లను సమీక్షించారు. వాతావరణ శాఖ అంచనాల ప్రకారం అక్టోబర్ 28న యానాం సమీపంలో తుఫాను తీరం దాటే అవకాశం ఉందని, గంటకు 115 నుంచి 125 కిలోమీటర్ల వేగంతో, గరిష్ఠంగా 140 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే ప్రమాదం ఉందని తెలిపారు. తీరప్రాంతాలు, లోతట్టు గ్రామాలు, వరద ముంపు ప్రాంతాల ప్రజలను ముందుగానే సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆదేశించారు. మూడు జిల్లాల్లో 24 గంటల కంట్రోల్ రూములు ఏర్పాటు చేసి, పునరావాస కేంద్రాల్లో ఆహారం, తాగునీరు, వైద్య సదుపాయాలు, విద్యుత్ అందుబాటులో ఉంచాలని సూచించారు. గర్భిణులు, వృద్ధులు, చిన్నారులు, దివ్యాంగులకు ప్రత్యేక రక్షణ కల్పించాలని, ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలను సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. ప్రమాదకర రహదారులు, వంతెనలు, వాగుల వద్ద రాకపోకలను నియంత్రించాలన్నారు. రైతులు, పంటల రక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని మంత్రి స్పష్టం చేశారు. కోతకు సిద్ధంగా ఉన్న వరి పంటలు, కల్లాల్లోని ధాన్యాన్ని సురక్షితంగా భద్రపరచాలని, కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడవకుండా టార్పాలిన్లు, గోదాములు అందుబాటులో ఉంచాలని సూచించారు. వరి, మొక్కజొన్న, పత్తి, అపరాల పొలాల్లో నీరు నిల్వ ఉండకుండా డ్రైనేజీ ఏర్పాట్లు చేయాలని, అరటి, బొప్పాయి, కొబ్బరి, ఆయిల్‌పామ్, మామిడి తోటలకు నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. రైతు సేవా కేంద్రాల ద్వారా ముందస్తు హెచ్చరికలు అందించాలని ఆదేశించారు. పశువులను ముంపు ప్రాంతాల నుంచి సురక్షిత ప్రాంతాలకు తరలించి, పశుగ్రాసం, మందులు, పశువైద్య బృందాలను సిద్ధంగా ఉంచాలని సూచించారు. మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లకుండా చర్యలు తీసుకోవాలని, చేపలు, రొయ్యల చెరువుల గట్లను పరిశీలించి ఆక్వా రైతులను అప్రమత్తం చేయాలన్నారు. శ్రీకాకుళంలో వంశధార, నాగావళి నదుల పరివాహక ప్రాంతాలు, పార్వతీపురం మన్యంలో కొండ ప్రాంతాలు, గిరిజన గ్రామాలు, కోనసీమలో గోదావరి డెల్టా, తీరప్రాంతాలు, ఆక్వా చెరువులపై ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు. తుఫాను తీవ్రత సమయంలో ప్రజలు అనవసరంగా బయటకు రాకుండా చూడాలని, తుఫాను తగ్గిన వెంటనే గ్రామాల వారీగా పంట, ఆస్తి నష్టం అంచనాలు ప్రారంభించి సహాయక చర్యలను వేగవంతం చేయాలని మంత్రి అచ్చెన్నాయుడు సూచించారు. క్షేత్రస్థాయి పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ అవసరమైన నిధులు, సిబ్బంది, పరికరాల వివరాలను ప్రభుత్వానికి తెలియజేయాలని కలెక్టర్లను ఆదేశించారు.

# ఇంటింటికీ ఆయుర్వేదం.. మన జీవన విధానం కావాలి: డాక్టర్ ఆర్. శ్రీనివాస్

**పాపాయపాలెంలో ఆయుర్వేదంపై అవగాహన సదస్సు, వైద్య శిబిరం**

రాజుపాలెం అక్టోబర్ 27:(మహి న్యూస్): ఇంటింటికీ ఆయుర్వేదాన్ని చేరువ చేసి, ప్రతి ఒక్కరూ ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని ప్రభుత్వ ఆయుర్వేద వైద్యాధికారి డాక్టర్ ఆర్. శ్రీనివాస్ సూచించారు. పల్నాడు జిల్లా రాజుపాలెం మండలం పాపాయపాలెం పార్వతీపురం మండల పరిషత్ పాఠశాల పెద్ద నందు ఆయుర్వేదం, కాలానుగుణంగా వచ్చే వ్యాధుల నివారణపై అవగాహన సదస్సుతో పాటు వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఆయుష్ డైరెక్టర్ శ్రీ




రోణంకి గోపాలకృష్ణ, ప్రాంతీయ ఉపసంచాలకులు ఎం. శేఖర్ రాజు ఆదేశాల మేరకు, కోట నెమలిపురి ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల వైద్యాధికారి డాక్టర్ ఆర్. శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ ఆయుర్వేదం అనేది కేవలం వైద్య విధానం మాత్రమే కాదని, ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు అనుసరించాల్సిన జీవన విధానమని




వివరించారు. మనసు, శరీరం, ఆత్మ మధ్య సమతుల్యతను కాపాడుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యాన్ని సాధించవచ్చని తెలిపారు. దినచర్య, ఋతుచర్యలకు ఆయుర్వేదంలో ఎంతో ప్రాముఖ్యత ఉందని పేర్కొన్నారు. ప్రతిరోజూ ఉదయం త్వరగా నిద్రలేవడం, శరీర తత్వానికి అనుగుణంగా తగినంత నీరు తాగడం, వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం, దంతధావనం చేయడం, యోగా సాధన చేయడం వంటి అలవాట్లను దినచర్యలో భాగంగా చేసుకోవాలని సూచించారు. సాత్విక ఆహారం తీసుకోవడంతో పాటు మజ్జిగ, ఇతర ద్రవ పదార్థాలను తగిన మోతాదులో తీసుకోవాలని తెలిపారు. స్థానికంగా లభించే ఆకుకూరలు, పండ్లు, కూరగాయలను ఆహారంలో భాగం చేసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవచ్చని వివరించారు. విద్యార్థినీ, విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత, వాటి ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించడంతో పాటు ఉపాధ్యాయులకు కూడా పరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఆయుష్ మందులను పంపిణీ చేశారు. యోగ ఉపాధ్యాయుడు జి. నరసింహారావు విద్యార్థులకు యోగాసనాలు వేయించి, యోగా వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ఆరోగ్యకరమైన జీవనశైలిలో యోగాకు ఉన్న ప్రాధాన్యతను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు తోట వెంకట సుబ్బలక్ష్మి, వి.వి.జి.కె. మూర్తి, ఎల్. రజినీకుమారి, షేక్ షంసుంగ్ బేగం, దుర్గ, ఆయుష్ సిబ్బంది, కాంపౌండర్ ఎస్. లక్ష్మీనారాయణ, గ్రామ పెద్దలు షేక్ ఇమామ్, ముంతాజ్, బడేబీ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు మానసిక ఆరోగ్యంపై అవగాహన

**శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతత కూడా ఎంతో ముఖ్యం: రోటరీ క్లబ్ అధ్యక్షుడు పఠాన్ నాగూర్ వలి**

**మానసిక సమస్యలను గుర్తించి, బాధితులకు కుటుంబ సభ్యులు అండగా నిలవాలి: డాక్టర్ కొండవీటి రామకోటయ్య**

**పల్నాడు జూనియర్ కళాశాలలో రోటరీ క్లబ్ ఆఫ్ మాచర్ల ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం**



మాచర్ల అక్టోబర్ 27:(మహి న్యూస్): విద్యార్థుల్లో మానసిక ఆరోగ్యంపై అవగాహన పెంపొందించడంతో పాటు, మానసిక ఆరోగ్యం ప్రాముఖ్యతను తెలియజేసేందుకు స్థానిక పల్నాడు జూనియర్ కళాశాలలో రోటరీ క్లబ్ ఆఫ్ మాచర్ల ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థినీ, విద్యార్థులకు మానసిక ఆరోగ్య పరిరక్షణ, ఒత్తిడిని అధిగమించే మార్గాలు, మానసిక సమస్యలను గుర్తించడం, వాటిని ఎదుర్కొనే విధానాలపై ప్రముఖులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ ఆఫ్ మాచర్ల అధ్యక్షుడు పఠాన్ నాగూర్ వలి మాట్లాడుతూ, మానసిక ఆరోగ్యం అంటే కేవలం వ్యాధులు లేకపోవడం మాత్రమే కాదని, భావోద్వేగ, మానసిక, సామాజిక శ్రేయస్సుతో కూడిన సమగ్ర స్థితి అని తెలిపారు. మనిషి ఆలోచనా విధానం, ప్రవర్తన, ఇతరులతో ఏర్పరచుకునే సంబంధాలపై మానసిక ఆరోగ్యం ప్రత్యక్ష ప్రభావం చూపుతుందని పేర్కొన్నారు. దైనందిన జీవితంలో ఎదురయ్యే ఒత్తిడిని సమర్థవంతంగా ఎదుర్కోవడానికి, ఇతరులతో సత్సంబంధాలను కొనసాగించడానికి మానసిక ఆరోగ్యం ఎంతో అవసరమని వివరించారు. ప్రముఖ మోటివేటర్, మానసిక నిపుణులు, గణితశాస్త్ర ఉపాధ్యాయుడు ఎం.బి.ఎస్. కోటేశ్వరరావు మాట్లాడుతూ, శారీరక ఆరోగ్యం ఎంత ముఖ్యమో మానసిక ప్రశాంతత కూడా అంతే ముఖ్యమని అన్నారు. ప్రతి ఒక్కరూ తమను తాము గౌరవించుకోవడంతో పాటు ఇతరుల పట్ల గౌరవం, ప్రేమ, సంరక్షణ కలిగి ఉండాలని సూచించారు. వ్యక్తుల మధ్య అనుబంధాలను గుర్తించడం, పర్యావరణం పట్ల ప్రేమను పెంపొందించుకోవడం, ఇతరుల స్వేచ్ఛను గౌరవించడం వంటి విలువలను విద్యార్థులు అలవర్చుకోవాలని తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ కొండవీటి రామకోటయ్య మాట్లాడుతూ, శారీరక వ్యాధులు, గాయాల మాదిరిగా మానసిక సమస్యలు పైకి స్పష్టంగా కనిపించవని, అందువల్ల వాటిని గుర్తించడం కొన్నిసార్లు కష్టమవుతుందని పేర్కొన్నారు. మానసిక సమస్యల గురించి మాట్లాడేందుకు చాలామంది సంకోచిస్తారని, ఈ పరిస్థితిని అధిగమించేందుకు సమాజంలో అవగాహన పెరగాల్సిన అవసరం ఉందని తెలిపారు. మానసిక రుగ్మతలు వ్యక్తుల భావోద్వేగాలు, ఆలోచనలు, ప్రవర్తనపై ప్రభావం చూపడంతో పాటు వారి రోజువారీ జీవితాన్ని కూడా ఇబ్బందులకు గురిచేస్తాయని వివరించారు. తినడం, నిద్రపోవడం, వ్యక్తిగత పరిశుభ్రతను పాటించడం వంటి సాధారణ కార్యకలాపాల్లోనూ సమస్యలు ఎదురుకావచ్చని తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లో బాధితులను నిర్లక్ష్యం చేయకుండా కుటుంబ సభ్యులు, స్నేహితులు వారికి ప్రేమతో కూడిన మద్దతు అందించాలని సూచించారు. అవసరమైనప్పుడు వైద్య నిపుణుల సహాయం తీసుకోవాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో పల్నాడు జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ నూతలపాటి శివభాస్కర్, కొమరా కాశి, అధ్యాపకులు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు. మానసిక ఆరోగ్యంపై అవగాహన కలిగి ఉండటం ద్వారా సమస్యలను సకాలంలో గుర్తించి, ఆరోగ్యకరమైన జీవితాన్ని గడపవచ్చని వక్తలు పేర్కొన్నారు.

# అర్నబ్ తుపాన్‌తో అప్రమత్తం.. నేడు, రేపు భారీ వర్షాలు

### పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో అతి తీవ్ర తుపాన్

### గంటకు 22 కి.మీ. వేగంతో కదలిక

### విశాఖకు 260 కి.మీ., కాకినాడకు 300 కి.మీ. దూరంలో కేంద్రీకృతం

### ప్రజలు సురక్షితంగా ఇళ్లలోనే ఉండాలి - ప్రఖర్ జైన్

అమరావతి, అక్టోబర్ 27: (మహి న్యూస్): పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో అర్నబ్ అతి తీవ్ర తుపాన్ కొనసాగుతోందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది. గత ఆరు గంటల్లో గంటకు 22 కిలోమీటర్ల వేగంతో తుపాన్ కదిలినట్లు తెలిపింది. మంగళవారం ఉదయం 9.30 గంటల సమాచారం ప్రకారం తుపాన్ విశాఖపట్నానికి 260 కిలోమీటర్లు, కాకినాడకు 300 కిలోమీటర్లు, మచిలీపట్నానికి 390 కిలోమీటర్లు, బాపట్లకు 460 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉంది. తుపాన్ ప్రభావంతో నేడు, రేపు కొన్ని ప్రాంతాల్లో అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, బలమైన ఈదురుగాలులు వీచే ప్రమాదం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది. తుపాన్ సమీపించే కొద్దీ ప్రభావం పెరిగే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. ప్రజలు సురక్షితంగా ఇళ్లలోనే ఉండాలని, అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ సూచించారు.

# అతి తీవ్ర తుపానుగా బలపడిన 'అర్నబ్'

### రేపు ఉదయం బాపట్ల--విశాఖపట్నం మధ్య యానాం సమీపంలో తీరం దాటే అవకాశం

### నేడు, రేపు రాష్ట్రవ్యాప్తంగా విస్తారంగా వర్షాలు

### కోస్తా తీరం వెంబడి గంటకు 90-100 కి.మీ వేగంతో ఈదురుగాలులు

### ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: ప్రఖర్ జైన్




ఆంధ్రప్రదేశ్, అక్టోబర్ 27: (మహి న్యూస్): పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో 'అర్నబ్' తుపాను అతి తీవ్ర తుపానుగా బలపడింది. గత ఆరు గంటల్లో గంటకు 25 కిలోమీటర్ల వేగంతో కదులుతున్నట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ తెలిపారు. ప్రస్తుతం తుపాను విశాఖపట్నానికి 300 కిలోమీటర్లు, కాకినాడకు 360 కిలోమీటర్లు, మచిలీపట్నానికి 460 కిలోమీటర్లు, బాపట్లకు 530 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉంది. తుపాను సాయంత్రం వరకు పశ్చిమ-వాయువ్య దిశగా, ఆ తర్వాత వాయువ్య దిశగా కదిలే అవకాశం ఉందని తెలిపారు. రేపు ఉదయానికి బాపట్ల--విశాఖపట్నం మధ్య యానాం సమీపంలో తీరం దాటే అవకాశం ఉందన్నారు. తుపాను ప్రభావంతో నేడు, రేపు రాష్ట్రవ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని, అక్కడక్కడ అత్యంత భారీ వర్షాలు పడవచ్చని హెచ్చరించారు. కోస్తా తీరం వెంబడి గంటకు 90 నుంచి 100 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రఖర్ జైన్ సూచించారు.




## రేణిగుంట విమానాశ్రయంలో ఉప రాష్ట్రపతికి ఘనంగా వీడ్కోలు

### జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ ఆధ్వర్యంలో వీడ్కోలు

### పాల్గొన్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్య ప్రసాద్, ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి తదితరులు







తిరుపతి, అక్టోబర్ 27: (మహి న్యూస్): తిరుమల, తిరుపతిలో రెండు రోజుల పర్యటన ముగించుకుని మంగళవారం ఉదయం రేణిగుంట విమానాశ్రయం నుంచి తిరుగు ప్రయాణమైన భారత ఉప రాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్‌కు జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్య ప్రసాద్, ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి, డీఐజీ షిమోషి, జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు, సిమ్స్ డైరెక్టర్ జగదీష్ తదితరులు పాల్గొని ఉప రాష్ట్రపతికి వీడ్కోలు పలికారు.

## జడ్పీటీసీ నామినేషన్ల తుది జాబితా ప్రక్రియలో పాల్గొన్న జిల్లా కలెక్టర్

### మధ్యాహ్నం 3 గంటలకు ముగిసిన నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ





చిత్తూరు, అక్టోబర్ 27: (మహి న్యూస్): జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ మంగళవారం స్థానిక జడ్పీ కార్యాలయంలోని సమావేశ మందిరంలో జడ్పీటీసీ నామినేషన్ల తుది జాబితా ప్రక్రియలో పాల్గొన్నారు. జడ్పీటీసీ నామినేషన్ల ఉపసంహరణ కార్యక్రమం మధ్యాహ్నం 3 గంటలకు ముగిసింది. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, ఆర్వో రవికుమార్ నాయుడు, డీపీఓ సుధాకర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

## బంగారుపాళ్యం మండలంలో తెలుగుదేశం పార్టీ 10 ఎంపిటిసి స్థానాలు ఏకగ్రీవం. 11 స్థానాల్లో నెలకొన్న పోటీ

### తెలుగుదేశంఏ జనసేన పార్టీ మధ్య రాగి మానుపెంట సెగ్మెంట్లో గట్టి  పోటీ.




చిత్తూరు జిల్లా బంగారుపాళ్యం మహి న్యూస్ అక్టోబర్ 27.:: చిత్తూరు జిల్లా బంగారుపాళ్యం మండలంలో 21 సెగ్మెంట్లలో ఎంపీటీసీ స్థానాలు ఉండగా, 10 ఎంపిటిసి స్థానాలు తెలుగుదేశం పార్టీ ఏకగ్రీవంగా కైవసం చేసుకుంది. మిగిలిన 11 స్థానాల్లో ఎంపిటిసి అభ్యర్థులు పోటీలో ఉన్నారు. అన్ని సెగ్మెంట్లలో తెలుగుదేశం వైసిపి అభ్యర్థులు పోటీపడుచుండగా, రాగిమానుపెంట సెగ్మెంట్ పరిధిలో మాత్రం కూటమి ప్రభుత్వంలో ఉన్న తెలుగుదేశం జనసేన పార్టీ ఎంపిటిసిలు ఎన్నడూ లేని విధంగా పోటీ పడుచున్నారు. ఇద్దరు అభ్యర్థులు బీఫారాలు అందుకున్నారు. అభ్యర్థుల గెలుపు కోసం పది రోజులపాటు వేసి చూడాల్సి ఉంది. తెలుగుదేశం పార్టీ ఇనామినెస్ కోసం ఒక్క సీటు కోసం మంగళవారం సాయంత్రం చివరి వరకు ఉత్కంఠ ఏర్పడింది.

### "పోటీలో ఉన్న 11 ఎంపీటీసీ సెగ్మెంట్లు"

బంగారు పాల్యం 2. బోడబండ్ల, చీకూరుపల్లి, జంబు వారిపల్లి, కీరమంద, నల్లంగాడు, పాలేరు, రాగిమానుపెంట, సంక్రాంతిపల్లి, తగ్గు వారిపల్లి 2. తుంబకుప్పం.

### తెలుగుదేశం పార్టీ 10 ఏకగ్రీవ సెగ్మెంట్లు.

బంగారుపాళ్యం 1. గుంతూరు, మహాసముద్రం, మొగిలి, నలగాంపల్లి, శెట్టేరి, టేకుమంద తగ్గువారిపల్లి 1. తంబుగానిపల్లి, తుంబపాల్యం. ఎన్నికల అధికారి ఇచ్చిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి.

## బయలు వీరభద్రస్వామికి ప్రదోషకాల అభిషేకం

శ్రీశైలం, మహి న్యూస్, అక్టోబర్ 27 : లోకకల్యాణం కోసం దేవస్థానం నిన్న సాయంకాలం శ్రీశైలక్షేత్ర పాలకుడైన శ్రీబయలు వీరభద్రస్వామివారికి విశేషపూజలను జరిపించనున్నది. ప్రతీ మంగళవారం మరియు అమావాస్యరోజులలో బయలువీరభద్రస్వామివారికి ఈ విశేష అభిషేకం, అర్చనలను నిర్వహించబడుతున్నాయి. బయలువీరభద్రస్వామివారు శివభక్తగణాలకు అధిపతి. అదేవిధంగా శ్రీశైలక్షేత్రపాలకుడుగా క్షేత్రానికి ఆరుబయట ఉండి, ఎటువంటి ఆచ్ఛాదన, ఆలయం లేకుండగా బయలుగా దర్శనమిస్తాడు కనుక ఆయనకు బయలువీరభద్రస్వామి అని పేరు వచ్చింది. ప్రసన్నవదనంతో కిరీట మకుటాన్ని కలిగి దశభుజుడైన స్వామివారు పది చేతులలో వివిధ ఆయుధాలతో దర్శనమిస్తాడు. స్వామివారికి క్రిందివైపున కుడివైపు దక్షుడు, ఎడమవైపు భద్రకాళి దర్శనమిస్తారు. ఈ స్వామిని దర్శించినంత మాత్రానే ఎంతటి క్లిష్ట సమస్యలైనా తొలగిపోతాయని, వ్యాధులు నశించి ఆయురారోగ్యాలు చేకూరుతాయని ప్రసిద్ధి. ముఖ్యంగా ఆగమసంప్రదాయంలో క్షేత్రపాలక పూజకు చాలా విశేషస్థానం ఉంది. క్షేత్ర పాలకుడికి పూజలు చేయడం వలన ఆ క్షేత్రంలో ఉన్నటువంటి భక్తులు ఎటువంటి భయం,బాధలు లేకుండా సుఖసంతోషాలతో ఉంటారు. మంగళవారం, ఆదివారం మరియు అమావాస్య రోజులలో చేసే వీరభద్రపూజ అనేక ఫలితాలు ఇస్తుందని ఆగమశాస్త్రాలు చెబుతున్నాయి. ఈ స్వామిపూజతో సకలగ్రహ అరిష్టదోషాలు, దుష్టగ్రహపీడలు తొలగిపోతాయి. అదేవిధంగా సంతానం, ఐశ్వర్యం మొదలైన అనేక శుభఫలితాలు చేకూరుతాయి. ఈ పూజాదికాలలో పంచామృతాలతోనూ, బిల్వోదకం, కుంకుమోదకం, హరిద్రోదకం, భస్మోదకం, గంధోదకం, పుష్పోదకం, శుద్ధజలాలతో స్వామివారికి అభిషేకం నిర్వహించడం జరుగుతుంది.

# కార్తిక మాసం సందర్భంగా పంచమఠాలలో ఆర్జిత అభిషేకాలు



శ్రీశైలం, మహి న్యూస్, అక్టోబర్ 27 : కార్తిక మాసోత్సవాల సందర్భంగా పంచమఠాలలో ఆర్జిత అభిషేకాలకు అవకాశం కల్పిస్తున్నట్లుగా ధర్మకర్తల మండలి అధ్యక్షులు శ్రీ పోతుగుంట రమేష్‌నాయుడు మరియు కార్యనిర్వహణాధికారి యం. శ్రీనివాసరావు తెలిపారు. నవంబరు 10వ తేదీ నుంచి డిసెంబరు 9వ తేదీ వరకు కార్తిక మాసోత్సవాలు నిర్వహిస్తున్నట్లుగా వారు తెలియజేశారు. భక్తులరద్దీ కారణంగా గతంలో వలనే ఈ సంవత్సరం కూడా ఈ కార్తిక మాసోత్సవాలలో ప్రధానాలయంలో నిర్వహించబడే శ్రీస్వామివారి గర్భాలయ అభిషేకాలు, సామూహిక అభిషేకాలు నిలుపుదల చేయడం జరిగిందన్నారు. కాగా శ్రీశైలమహాక్షేత్రంలో కార్తిక మాసం సందర్భంగా భక్తులు పరమేశ్వరునికి అభిషేకాలను జరిపించుకునేందుకు వీలుగా పంచమఠాలలో ఆర్జిత అభిషేకాన్ని ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. ముఖ్యంగా సామాన్య భక్తులు ఈ అభిషేకాన్ని జరిపించుకునేందుకు వీలుగా కేవలం రూ. 216లను మాత్రమే రుసుముగా నిర్ణయించడం జరిగిందన్నారు. ఒక టికెట్ పై దంపతులు లేదా ఒకరిని అభిషేకానికి అనుమతించడం జరుగుతుందన్నారు. ఈ ఆర్జిత అభిషేక టికెట్లను మనమిత్ర వాట్సాప్ నెంబరు 9552300009 మరియు ఏ.పి.టి.ఎస్ వారి వెబ్‌సైట్ www.tms.ap.gov.in ద్వారా పొందవచ్చునని అన్నారు. భక్తులు వారి అభీష్టం మేరకు పంచమఠాలుగా ప్రసిద్ధమైన ఘంటామఠం, భీమశంకరమఠం, విభూతిమఠం, రుద్రాక్షమఠం, సారంగధరమఠాలలోని ఏదైనా ఒక మఠంలో ఈ ఆర్జిత అభిషేకాన్ని జరిపించుకోవచ్చునని వారు తెలియజేశారు. ఇంకా వారు మాట్లాడుతూ శ్రీశైల సంస్కృతిలో చాలాకాలం పాటు ఈ పంచమఠాలు ప్రధానపాత్ర పోషించాయన్నారు. వ్యవహారంలో ఇవి మఠాలుగా పిలువబడుతున్నప్పటికీ ఈ అయిదు కూడా గర్భాలయం, అంతరాలయం, ముఖమండపం లాంటి నిర్మాణాలను కలిగివుండి ఆలయ లక్షణాలు కలిగివుండడం ఎంతో విశేషమన్నారు. కొన్ని శతాబ్దాల నుండి కూడా ఈ మఠాలన్నీ క్షేత్ర ప్రశాంతతలోనూ, ఆలయ నిర్వహణలోనూ, ఆధ్యాత్మికపరంగా కూడా ప్రధాన భూమికను వహించాయన్నారు. ముఖ్యంగా ఈ పంచమఠాలు ధ్యానకేంద్రాలుగా ప్రసిద్ధమయ్యాయన్నారు. కావున భక్తులు దేవస్థానం కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని కార్తికమాసంలో అభిషేకాలను జరిపించుకోవాలని ధర్మకర్తల మండలి అధ్యక్షులు మరియు కార్యనిర్వహణాధికారి తెలియజేశారు.

## సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేసిన కర్నూలు ఎస్పీ

### పోలింగ్ కేంద్రాల్లో భద్రత, సీసీ కెమెరాల నిఘా పరిశీలన

### ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా పటిష్ట భద్రతా చర్యలు చేపట్టాలని ఆదేశం






కర్నూలు, అక్టోబర్ 27: (మహి న్యూస్): మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల నేపథ్యంలో కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ మంగళవారం సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. కర్నూలు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని నెహ్రూ మెమోరియల్ స్కూల్, ఉస్మానియా కళాశాల, పెద్ద మార్కెట్ సమీపంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రాల్లో భద్రతా ఏర్పాట్లు, సీసీ కెమెరాల నిఘా, శాంతిభద్రతల పరిరక్షణకు తీసుకోవాల్సిన ముందస్తు చర్యలను పరిశీలించి సంబంధిత అధికారులకు సూచనలు చేశారు. ఎన్నికలు ప్రశాంతంగా, స్వేచ్ఛాయుత వాతావరణంలో జరిగేలా పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని ఆదేశించారు. ఈ తనిఖీల్లో కర్నూలు వన్‌టౌన్ సీఐ జి. మారుతి శంకర్, స్పెషల్ బ్రాంచ్ సీఐ మధుసూదన్ రావు పాల్గొన్నారు.

# అర్నబ్ తుఫాను ప్రభావం నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

### ప్రజల భద్రతే ప్రాధాన్యం - జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్

మదనపల్లి, మహి న్యూస్, అక్టోబరు 27: అర్నబ్ తుఫాను ప్రభావంతో... జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో రాబోయే రెండు రోజులు పిడుగులు పడే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ సూచించిన నేపథ్యంలో...వాతావరణ పరిస్థితులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, తగిన జాగ్రత్తలు పాటించాలని, సంబంధిత శాఖల అధికారులు ముందస్తు రక్షణ చర్యలు చేపట్టాలని అన్నమయ్య జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ సూచించారు.

### ప్రజలు పాటించాల్సిన జాగ్రత్తలు:

1. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే సమయంలో ప్రజలు వీలైనంత వరకు ఇళ్లలోనే సురక్షితంగా ఉండాలి. 2. పిడుగులు పడే సమయంలో చెట్ల కింద, విద్యుత్ స్తంభాల సమీపంలో, బహిరంగ ప్రదేశాల్లో ఆశ్రయం పొందరాదు. 3. రైతులు, వ్యవసాయ కూలీలు, పశువుల కాపరులు వాతావరణ పరిస్థితులను గమనిస్తూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ఉరుములు, మెరుపులు ప్రారంభమైన వెంటనే పొలాల్లో పనులు నిలిపివేసి సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలి. 4. వర్షాలు, ఈదురుగాలుల సమయంలో విద్యుత్ తీగలు, తెగిపడిన వైర్లు, నీరు నిలిచిన విద్యుత్ పరికరాలకు దూరంగా ఉండాలి. విద్యుత్ ప్రమాదాలు కనిపిస్తే వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలి. 5. చెరువులు, వాగులు, కాలువలు, లోతట్టు ప్రాంతాల వద్దకు వెళ్లరాదు. వర్షపు నీరు ప్రవహించే రహదారులను దాటేందుకు ప్రయత్నించరాదు. 6. బలమైన గాలులు వీచే సమయంలో చెట్లు, శిథిలావస్థలో ఉన్న భవనాలు, హోర్డింగ్‌లు, బలహీనమైన విద్యుత్ స్తంభాల సమీపంలో ఉండరాదు. 7. అత్యవసర పరిస్థితుల్లో అధికారుల సూచనలు పాటిస్తూ సురక్షిత ప్రాంతాలకు చేరుకోవాలి.

### అధికారులకు ఆదేశాలు:

తుఫాను ప్రభావం, వర్షాలు, పిడుగుల ప్రమాదాల నేపథ్యంలో రెవెన్యూ, పోలీసు, పంచాయతీరాజ్, మున్సిపల్, విద్యుత్, వ్యవసాయ, వైద్య ఆరోగ్య శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. మండల స్థాయి అధికారులు వాతావరణ పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించాలని, ప్రజలకు అవసరమైన ముందస్తు హెచ్చరికలు అందించాలని సూచించారు. లోతట్టు ప్రాంతాలు, వర్షపు నీరు నిలిచే ప్రదేశాలు, ప్రమాదకర ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు సంబంధిత శాఖలు సిబ్బందిని, అవసరమైన సహాయక సామగ్రిని సిద్ధంగా ఉంచుకోవాలని ఆదేశించారు. విద్యుత్ శాఖ అధికారులు తెగిపడిన విద్యుత్ తీగల విషయంలో అప్రమత్తంగా ఉండాలని, పోలీసు, రెవెన్యూ అధికారులు ప్రజలకు భద్రతా సూచనలు అందించాలని తెలిపారు. గ్రామ, వార్డు స్థాయి సిబ్బంది ప్రజలకు వాతావరణ హెచ్చరికలను చేరవేయాలని సూచించారు. ప్రజలు వాతావరణ పరిస్థితులను నిరంతరం గమనిస్తూ, అధికారుల సూచనలు పాటించాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ కోరారు. అత్యవసర పరిస్థితుల్లో సంబంధిత అధికారులకు వెంటనే సమాచారం అందించి, తుఫాను ప్రభావం తగ్గే వరకు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

## ప్రజలందరూ దీపావళి పండుగను ఆనందంగా, సురక్షితంగా జరుపుకునేలా చర్యలు చేపట్టాలి



మదనపల్లె, మహి న్యూస్, అక్టోబర్ 27: ప్రజలందరూ దీపావళి పండుగను ఆనందంగా, సురక్షితంగా జరుపుకునేలా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని జిల్లా జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ శర్మ ఆదేశించారు. బాణసంచా విక్రయ కేంద్రాల నిర్వాహకులు తప్పనిసరిగా ముందస్తు లైసెన్సులు పొందడంతో పాటు, ప్రభుత్వ నిబంధనలు, అగ్నిమాపక భద్రతా ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని స్పష్టం చేశారు. నవంబర్ 8న దీపావళి పండుగను పురస్కరించుకొని బాణసంచా భద్రతా నిర్వహణపై డివిజనల్ అధికారులు, పోలీసు, అగ్నిమాపక, విద్యుత్, రెవెన్యూ, మండలాల తహసీల్దార్లు, ఎంపీడీవోలు తదితర అధికారులతో మంగళవారం మదనపల్లె కలెక్టరేట్ నుండి జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా జాయింట్ కలెక్టర్ జిల్లా స్థాయి కమిటీ సమావేశం నిర్వహించి తీసుకోవాల్సిన చర్యలపై దిశా నిర్దేశం చేశారు. . ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ... , అగ్నిప్రమాదాల నివారణకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన వన్ మ్యాన్ కమిటీ సూచనలను బాణసంచా విక్రయదారులు తప్పనిసరిగా పాటించేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. బాణసంచా విక్రయ కేంద్రాలకు అనుమతులు, భద్రతా ఏర్పాట్లు, నిబంధనల అమలు, ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు పలు సూచనలు చేశారు. ముందస్తు లైసెన్సులు లేకుండా బాణసంచా విక్రయాలు చేపట్టకుండా చూడాలని, నిబంధనలకు అనుగుణంగా మాత్రమే విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేసేలా పర్యవేక్షించాలని ఆదేశించారు. నిబంధనలను ఉల్లంఘించే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. బాణసంచా విక్రయ కేంద్రాల వద్ద అగ్నిమాపక భద్రతా పరికరాలు, ఇసుక, నీటి బకెట్లు అందుబాటులో ఉంచాలని, అత్యవసర పరిస్థితుల్లో అగ్నిమాపక, వైద్య సేవలు సత్వరమే అందుబాటులోకి వచ్చేలా ఏర్పాట్లు చేయాలన్నారు. విక్రయ కేంద్రాల వద్ద వాహనాల పార్కింగ్‌కు తగిన స్థలం కేటాయించడంతో పాటు, ప్రజలకు అవసరమైన సూచనలు అందించేందుకు పబ్లిక్ అడ్రస్ సిస్టమ్ ఏర్పాటు చేయాలని సూచించారు. సబ్ కలెక్టర్లు, ఆర్డీవోలను ఉద్దేశించి మాట్లాడుతూ..., సంబంధిత ప్రాంతాల్లోని బాణసంచా తయారీ కేంద్రాలు, గోదాములు, విక్రయ కేంద్రాలను తనిఖీ చేయాలని ఆదేశించారు. విక్రయదారులతో సమావేశాలు నిర్వహించి, భద్రతా ప్రమాణాలు, ప్రభుత్వ నిబంధనలపై అవగాహన కల్పించాలన్నారు. ఇప్పటికే సంబంధిత శాఖలకు అవసరమైన మార్గదర్శకాలు పంపించినట్లు తెలిపారు. రెవెన్యూ, పోలీసు, అగ్నిమాపక, విద్యుత్, మున్సిపల్ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు.

### బాణసంచా విక్రయ కేంద్రాల నిర్వాహకులు తప్పనిసరిగా పాటించాల్సిన నిబంధనలు:

1. ముందస్తు లైసెన్సులు: బాణసంచా విక్రయించాలనుకునే ప్రతి నిర్వాహకుడు సంబంధిత అధికారుల నుంచి ముందస్తు లైసెన్సులు, అవసరమైన అనుమతులు పొందాలి. అనుమతులు లేకుండా విక్రయాలు చేపట్టరాదు. 2. అగ్నిమాపక భద్రత: ప్రతి విక్రయ కేంద్రం వద్ద ఇసుక, నీటి బకెట్లు, అవసరమైన అగ్నిమాపక పరికరాలు అందుబాటులో ఉంచాలి. 3. భద్రతా సూచనల ప్రదర్శన: కొనుగోలుదారులు బాణసంచాను ఇంటికి తీసుకెళ్లి వినియోగించే సమయంలో పాటించాల్సిన జాగ్రత్తలను స్పష్టంగా కనిపించే ప్రదేశంలో ప్రదర్శించాలి. 4. విక్రయ కేంద్రాల మధ్య దూరం: నిబంధనల ప్రకారం బాణసంచా విక్రయ కేంద్రాల మధ్య తగినంత దూరం ఉండేలా చూడాలి. 5. ధరల పట్టిక: అన్ని రకాల బాణసంచా ధరల వివరాలను విక్రయ కేంద్రాల వద్ద ప్రజలకు స్పష్టంగా కనిపించేలా ప్రదర్శించాలి. 6. పారిశుద్ధ్యం: విక్రయ కేంద్రాల వద్ద, పరిసర ప్రాంతాల్లో పరిశుభ్రత పాటించాలి. వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించాలి. 7. రవాణా, అత్యవసర ఏర్పాట్లు: విక్రయ కేంద్రాల వద్ద ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా పార్కింగ్ ఏర్పాట్లు చేయాలి. అత్యవసర సేవలకు ఆటంకం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ఈ నిబంధనల అమలుపై సంబంధిత శాఖల అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని జాయింట్ కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీ వెంకటాద్రి, సబ్ కలెక్టర్ చల్ల కళ్యాణి, జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేష్, ఆర్డీవోలు శ్రీనివాస్,విజయలక్ష్మి,ఆయాశాఖల జిల్లాఅధికారులు మండల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అర్నాబ్ తుఫాన్‌పై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

### బుధవారం పాఠశాలలు, కళాశాలలకు సెలవు

### అంగన్‌వాడీ కేంద్రాలకు మూడు రోజులపాటు సెలవు

### వాగులు, వంకలు, నదులు దాటవద్దు.. ఈతకు, చేపలు పట్టేందుకు వెళ్లవద్దు

### అత్యవసర సేవలకు అంతరాయం లేకుండా చర్యలు

గుంటూరు, అక్టోబర్ 27: (మహి న్యూస్): అర్నాబ్ తుఫాన్ కారణంగా బుధవారం భారీ వర్షాలు, తీవ్ర గాలులు వీచే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ సి.యం. సాయికాంత్ వర్మ కోరారు. అత్యవసర పనులు ఉంటే తప్ప బయటకు రావద్దని సూచించారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో తుఫాన్ ముందస్తు చర్యలను వివరించారు. బుధవారం, అక్టోబర్ 28న పాఠశాలలు, కళాశాలలకు సెలవు ప్రకటించినట్లు కలెక్టర్ తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాలకు ఇప్పటికే మూడు రోజులపాటు సెలవులు ప్రకటించినట్లు చెప్పారు. వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉందన్నారు. లోతట్టు ప్రాంతాలను గుర్తించామని, అవసరమైతే సిద్ధంగా ఉన్న 34 పునరావాస కేంద్రాలకు ప్రజలను తరలిస్తామని తెలిపారు. వృద్ధులు, చిన్నారులు, గర్భిణులు, బాలింతల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని అధికారులకు సూచించినట్లు చెప్పారు. ప్రకాశం బ్యారేజీ నీటి నిల్వలు, వాగుల ప్రవాహాలను జలవనరుల శాఖ నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించినట్లు తెలిపారు. బలహీనంగా ఉన్న చెరువులు, వాగుల గట్లను గుర్తించి ఇసుక బస్తాలను సిద్ధం చేయాలని సూచించారు. గాలులకు హోర్డింగ్‌లు, ఫ్లెక్సీలు పడిపోయే ప్రమాదం ఉన్నందున వాటిని తొలగించే చర్యలు చేపట్టినట్లు తెలిపారు. తాగునీటి పథకాలకు అవసరమైన నీటిని సిద్ధం చేసుకోవడంతోపాటు జనరేటర్లు అందుబాటులో ఉంచాలని, తాగునీరు కలుషితం కాకుండా క్లోరినేషన్ చేపట్టాలని ఆదేశించినట్లు చెప్పారు. రహదారులు, భవనాలు, పంచాయతీరాజ్, విద్యుత్, రవాణా, పౌరసరఫరాలు, విపత్తు నిర్వహణ శాఖలు అప్రమత్తంగా ఉన్నాయని తెలిపారు. మొబైల్, టెలికాం సేవలకు అంతరాయం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సంబంధిత సంస్థలను ఆదేశించినట్లు చెప్పారు. రేషన్ దుకాణాల్లో రెండు నెలలకు సరిపడా నిత్యావసర సరుకులు సిద్ధం చేసినట్లు వెల్లడించారు. రైతులకు తుఫాన్‌పై అవగాహన కల్పించి అవసరమైన సూచనలు అందించాలని వ్యవసాయ, ఉద్యానవన శాఖలను ఆదేశించారు. పశువులను సురక్షిత ప్రాంతాలకు తరలించి, వాటికి అవసరమైన ఆహారం అందించేలా పశుసంవర్ధక శాఖ చర్యలు చేపట్టిందన్నారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో 08632234014 నంబర్‌తో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పర్యవేక్షణ కోసం సిబ్బందిని నియమించామని, ఎన్నికల విధులతోపాటు తుఫాన్ పరిస్థితులను కూడా సమర్థవంతంగా పర్యవేక్షిస్తున్నామని చెప్పారు.



### ఆసుపత్రుల్లో విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు

ఆసుపత్రుల్లో, ముఖ్యంగా అత్యవసర వైద్య సేవలు, ఆపరేషన్ థియేటర్ల వద్ద విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని వైద్య ఆరోగ్యశాఖను ఆదేశించినట్లు కలెక్టర్ తెలిపారు. హైరిస్క్ గర్భిణులను ముందుగానే ఆసుపత్రులకు తరలించాలని, వైద్య సేవలకు ఎలాంటి అంతరాయం కలగకుండా చూడాలని సూచించారు.

### వాగులు, వంకలు, నదులు దాటవద్దు

తుఫాన్ ప్రభావంతో నీటి ప్రవాహాలు పెరిగే అవకాశం ఉన్నందున వాగులు, వంకలు, నదులను దాటవద్దని కలెక్టర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. నీటి ప్రవాహాల వద్దకు ఈతకు వెళ్లడం, చేపలు పట్టడం చేయరాదని హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎన్.ఎస్.కె. ఖాజావలి పాల్గొన్నారు.

RNI : APTEL/25/A0108
www.mahinewsindia.com
epaper: https://epaper.mahinewsindia.com

# ఓటరు స్లిప్పులపై ఆందోళన అక్కర్లేదు

### ఓటు వేయడానికి ఓటరు స్లిప్పు తప్పనిసరి కాదు

### ఎస్ఈసీ వెబ్‌సైట్‌లో ఓటరు, పోలింగ్ కేంద్రం వివరాలు తెలుసుకోవచ్చు

### గుర్తింపు కార్డుతో ఓటు హక్కు వినియోగించుకోవచ్చు

### అడిషనల్ ఎలక్షన్ అథారిటీ, కమిషనర్ చల్లా ఓబులేసు



కర్నూలు, అక్టోబర్ 27: (మహి న్యూస్): ఓటరు స్లిప్పు లేకపోయినా ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఓటు వేయడానికి ఓటరు స్లిప్పు తప్పనిసరి కాదని అడిషనల్ ఎలక్షన్ అథారిటీ, నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు మంగళవారం తెలిపారు. ఓటరు స్లిప్పు కేవలం ఓటరు వివరాలు, వార్డు నంబరు, పోలింగ్ కేంద్రం వివరాలు తెలుసుకోవడానికి మాత్రమే ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఓటర్లు రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారిక వెబ్‌సైట్ [https://sec-ems.ap.gov.in/apsec/](https://sec-ems.ap.gov.in/apsec/?utm_source=chatgpt.com) ద్వారా తమ ఓటరు వివరాలు, పోలింగ్ కేంద్రం వివరాలను తెలుసుకోవచ్చని సూచించారు. ఓటరు స్లిప్పు లేకపోయినా, ఎన్నికల సంఘం ఆమోదించిన గుర్తింపు కార్డును చూపించి ఓటు హక్కును వినియోగించుకోవచ్చని తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని, అనవసరమైన అపోహలకు గురికావద్దని చల్లా ఓబులేసు సూచించారు.

# నవంబర్ 1న పోలింగ్ జరిగే ప్రాంతాల్లో స్థానిక సెలవు

### ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలు, కార్యాలయాలకు సెలవు

### ఉద్యోగులు ఓటు హక్కు వినియోగించుకునేందుకు అవకాశం

### జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డా. ఏ. సిరి

కర్నూలు, అక్టోబర్ 27: (మహి న్యూస్): స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో నవంబర్ 1, 2026న పోలింగ్ జరిగే ప్రాంతాల్లో స్థానిక సెలవు ప్రకటిస్తూ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డా. ఏ. సిరి ఆదేశాలు జారీ చేశారు. పోలింగ్ జరిగే ప్రాంతాల్లోని ప్రభుత్వ కార్యాలయాలు, స్థానిక సంస్థలు, ప్రభుత్వ సంస్థలు, ప్రభుత్వ, ప్రైవేట్ రంగ సంస్థలు, ఫర్మ్‌లకు ఈ సెలవు వర్తిస్తుందని కలెక్టర్ తెలిపారు. ఆయా సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగులు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు వీలుగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. నెగోషియబుల్ ఇన్‌స్ట్రుమెంట్స్ యాక్ట్, 1981 ప్రకారం కూడా పోలింగ్ జరిగే ప్రాంతాల్లో నవంబర్ 1న స్థానిక సెలవు వర్తిస్తుందని స్పష్టం చేశారు. పోలింగ్ కేంద్రాలుగా గుర్తించిన ప్రభుత్వ భవనాలు, విద్యాసంస్థలు, ఇతర భవనాలకు పోలింగ్‌కు ముందు రోజు, పోలింగ్ రోజు, ఓట్ల లెక్కింపు రోజున స్థానిక సెలవు వర్తిస్తుందని తెలిపారు. ఎన్నికల ప్రక్రియ సజావుగా నిర్వహించడంతో పాటు అర్హులైన ఓటర్లందరూ తమ ఓటు హక్కును వినియోగించుకునేలా ఈ ఆదేశాలు జారీ చేసినట్లు కలెక్టర్ డా. ఏ. సిరి పేర్కొన్నారు.

# అర్నబ్ తుఫానుపై అప్రమత్తంగా ఉండాలి

### కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు

### అత్యవసర పరిస్థితుల్లో 08518-277305 నంబర్‌కు సమాచారం ఇవ్వాలి

### ప్రజలు అప్రమత్తంగా ఉండాలి - కలెక్టర్ డా. ఏ. సిరి

కర్నూలు, అక్టోబర్ 27: (మహి న్యూస్): అర్నబ్ తుఫాను ప్రభావం నేపథ్యంలో కర్నూలు కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి మంగళవారం తెలిపారు. రాబోయే రెండు రోజుల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తుఫాను ప్రభావంతో భారీ వర్షాలు లేదా ఇతర అత్యవసర పరిస్థితులు ఎదురైతే తక్షణ సహాయం కోసం 08518--277305 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం అందించాలని కలెక్టర్ కోరారు. ప్రజలకు అవసరమైన సహాయం అందించేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.

# ఎన్నికల నేపథ్యంలో పింఛన్ల పంపిణీకి పటిష్ట ఏర్పాట్లు

### అక్టోబర్ 30న పింఛన్ల పంపిణీ ని

### అక్టోబర్ 29న నగదు ఉపసంహరణకు చర్యలు

### బ్యాంకు శాఖల్లో నగదు కొరత లేకుండా చూడాలి: కలెక్టర్ జి. రాజకుమారి



నంద్యాల, అక్టోబర్ 27: (మహి న్యూస్): నవంబర్ 1న పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలు, నవంబర్ 3న జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో పింఛన్ల పంపిణీకి ఎలాంటి ఆటంకాలు కలగకుండా పటిష్టమైన ముందస్తు ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అధికారులను ఆదేశించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల సంఘం అనుమతికి లోబడి అక్టోబర్ 30న పింఛన్ల పంపిణీ చేపట్టేందుకు, అక్టోబర్ 29న నగదు ఉపసంహరణ జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. బ్యాంకు శాఖల్లో తగినంత నగదు అందుబాటులో ఉండేలా సంబంధిత రీజినల్ మేనేజర్లు, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు. నగదు కొరత కారణంగా పింఛనుదారులకు ఇబ్బందులు కలగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి పింఛన్ల పంపిణీని సజావుగా పూర్తి చేయాలని ఆదేశించారు.

# ఎన్టీఆర్ భరోసా పింఛన్లు అక్టోబర్ 30న పంపిణీ

### ఎన్నికల నేపథ్యంలో పింఛన్ల పంపిణీ తేదీలో మార్పు

### అక్టోబర్ 29న బ్యాంకుల నుంచి నగదు డ్రా చేయాలని ఆదేశాలు

### మిగిలిన పింఛన్లు నవంబర్ 4, 5 తేదీల్లో పంపిణీ

కర్నూలు, అక్టోబర్ 27: (మహి న్యూస్): ఎన్నికల నేపథ్యంలో ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రతా పింఛన్ల పంపిణీ తేదీలో మార్పు చేసినట్లు జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి, ఐఏఎస్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ముందస్తు అనుమతితో రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఆదేశాల మేరకు సాధారణంగా ప్రతి నెల 1వ తేదీన పంపిణీ చేసే పింఛన్లను ఈసారి అక్టోబర్ 30న పంపిణీ చేయాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. పింఛన్ల పంపిణీకి అవసరమైన నగదును అక్టోబర్ 29న బ్యాంకుల నుంచి డ్రా చేసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. ఈ మేరకు డీఆర్‌డీఏ అధికారులు, మండల, మున్సిపల్, గ్రామ స్థాయి అధికారులకు సూచనలు జారీ చేసినట్లు వెల్లడించారు. అక్టోబర్ 30న పంపిణీ చేయగా మిగిలిపోయిన పింఛన్లను నవంబర్ 4, 5 తేదీల్లో పంపిణీ చేస్తామని కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని ఎన్టీఆర్ భరోసా పింఛన్ల లబ్ధిదారులందరూ ఈ మార్పును గమనించాలని సూచించారు.

# కర్నూలులో ముగిసిన పోస్టల్ బ్యాలెట్ పోలింగ్

### ఓటు హక్కు వినియోగించుకున్న 1,106 మంది ఎన్నికల విధుల సిబ్బంది

### 763 మంది పురుషులు, 343 మంది మహిళల ఓటింగ్

### వివరాలు వెల్లడించిన కమిషనర్ చల్లా ఓబులేసు








కర్నూలు, అక్టోబర్ 27: (మహి న్యూస్): స్థానిక ఎన్నికల నేపథ్యంలో కర్నూలు నగరపాలక సంస్థ ఓటరు జాబితాలో పేరుండి, కర్నూలుతో పాటు ఇతర ప్రాంతాల్లో ఎన్నికల విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు, పోలీసు సిబ్బందికి నిర్వహించిన పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ ముగిసింది. మంగళవారం నగరంలోని దామోదరం సంజీవయ్య మెమోరియల్ పాఠశాలలో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ సెంటర్‌లో మొత్తం 1,106 మంది ఓటు హక్కును వినియోగించుకున్నట్లు అడిషనల్ ఎలక్షన్ అథారిటీ, నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు తెలిపారు. ఓటు హక్కు వినియోగించుకున్న వారిలో 763 మంది పురుషులు, 343 మంది మహిళలు ఉన్నట్లు వెల్లడించారు. ఎన్నికల విధులు నిర్వహిస్తున్న పోలింగ్ సిబ్బంది, పోలీసు సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసేందుకు అవకాశం కల్పించినట్లు చల్లా ఓబులేసు తెలిపారు. విధుల్లో పాల్గొనే సిబ్బంది తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు అవసరమైన ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికలకు పటిష్ట ఏర్పాట్లు

### స్ట్రాంగ్ రూమ్‌లు, కౌంటింగ్ హాళ్లు, రిసెప్షన్ కేంద్రాల పరిశీలన

### భద్రత, బారికేడ్లు, ప్రవేశ-నిష్క్రమణ మార్గాలపై ప్రత్యేక దృష్టి

### అధికారులకు సూచనలు చేసిన కలెక్టర్ డా. ఏ. సిరి, ఎస్పీ విక్రాంత్ పాటిల్



కర్నూలు, అక్టోబర్ 27: (మహి న్యూస్): స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డా. ఏ. సిరి అధికారులను ఆదేశించారు. మంగళవారం కర్నూలులోని ప్రభుత్వ సిల్వర్ జూబ్లీ



కళాశాల, ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేస్తున్న స్ట్రాంగ్ రూమ్‌లు, కౌంటింగ్ హాళ్లు, రిసెప్షన్ కేంద్రాలను జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్, జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్‌తో కలిసి పరిశీలించారు. ప్రభుత్వ సిల్వర్ జూబ్లీ కళాశాలలో కర్నూలు రూరల్, గూడూరు, ఓర్వకల్లు, కృష్ణగిరి మండలాలకు, ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో కోడుమూరు, సి. బెలగల్, కల్లూరు, వెల్దుర్తి మండలాలకు సంబంధించి ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. ఎన్నికల సామగ్రి భద్రపరిచే స్ట్రాంగ్ రూమ్‌లు, ఓట్ల లెక్కింపు కేంద్రాలు, రిసెప్షన్ ప్రాంతాల్లో అవసరమైన సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. అధికారులు, సిబ్బంది రాకపోకలకు ఇబ్బందులు లేకుండా ప్రవేశ, నిష్క్రమణ మార్గాలను గుర్తించి, అవసరమైన చోట బారికేడ్లు ఏర్పాటు చేయాలన్నారు. స్ట్రాంగ్ రూమ్‌లు, కౌంటింగ్ కేంద్రాల వద్ద పటిష్ట భద్రత కల్పించాలని స్పష్టం చేశారు. జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ మాట్లాడుతూ జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల ఓట్ల లెక్కింపు కేంద్రాల వద్ద పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కౌంటింగ్ సిబ్బంది, ఎన్నికల ఏజెంట్లకు ప్రత్యేక ప్రవేశ మార్గాలు ఏర్పాటు చేయాలని, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. పోలీసు, రెవెన్యూ, ఎన్నికల అధికారులు సమన్వయంతో పనిచేసి, కౌంటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ పరిశీలనలో జిల్లా పరిషత్ సీఈవో సుధాకర్ రెడ్డి, కర్నూలు ఆర్డీవో సందీప్ కుమార్, తహశీల్దార్లు వెంకట రమేష్ బాబు, ఆంజనేయులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# దీపావళికి గ్రీన్ క్రాకర్స్ మాత్రమే విక్రయించాలి, కాల్చాలి

### నిషేధిత టపాసుల తయారీ, విక్రయాలు, రవాణా, వినియోగంపై కఠిన చర్యలు

### నిబంధనలకు విరుద్ధంగా విక్రయిస్తే లైసెన్సులపై చర్యలు

### అన్ని శాఖల అధికారులు సమన్వయంతో తనిఖీలు చేపట్టాలి

### జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి

కర్నూలు, అక్టోబర్ 27: (మహి న్యూస్): దీపావళి పండుగ సందర్భంగా జిల్లాలో గ్రీన్ క్రాకర్స్ (పర్యావరణహిత బాణసంచా) మాత్రమే విక్రయించాలని, కాల్చాలని జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి అధికారులను ఆదేశించారు. సుప్రీంకోర్టు, జాతీయ హరిత ట్రిబ్యునల్ (ఎన్‌జీటీ) ఆదేశాలు, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి (ఏపీపీసీబీ) మార్గదర్శకాలను అమలు చేయాలని సూచించారు. మంగళవారం దీపావళి నేపథ్యంలో టపాసుల తయారీ, విక్రయాలు, నిల్వలు, రవాణా, వినియోగంపై రెవెన్యూ, పోలీస్, రవాణా, మున్సిపల్, పంచాయతీరాజ్, అగ్నిమాపక, కాలుష్య నియంత్రణ మండలి అధికారులతో కలెక్టర్ టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గాలి, శబ్ద కాలుష్యాన్ని నియంత్రించడంతో పాటు ప్రజల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. నిషేధిత రసాయనాలు, బేరియం లవణాలు కలిగిన టపాసుల తయారీ, విక్రయాలు, రవాణా, వినియోగాన్ని అనుమతించరాదన్నారు. గ్రీన్ క్రాకర్స్ పేరుతో నిబంధనలకు విరుద్ధంగా టపాసులు విక్రయించకుండా తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. గ్రీన్ క్రాకర్స్ తయారీ, విక్రయాలకు అవసరమైన లైసెన్సులు, అనుమతులు తప్పనిసరిగా ఉండాలని స్పష్టం చేశారు. తయారీదారులు సీఎస్ఐఆర్-నీరీఆ నిర్దేశించిన ధ్రువీకరణ, రిజిస్ట్రేషన్ నిబంధనలు పాటించేలా అధికారులు పరిశీలించాలన్నారు. జిల్లాలో టపాసుల తయారీ, నిల్వ, విక్రయ కేంద్రాలపై పోలీస్, రెవెన్యూ, రవాణా, మున్సిపల్, పంచాయతీరాజ్, అగ్నిమాపక శాఖల అధికారులు సమన్వయంతో తనిఖీలు నిర్వహించాలని సూచించారు. నిబంధనలను ఉల్లంఘించిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవడంతో పాటు, అవసరమైతే టపాసుల నిల్వలను స్వాధీనం చేసుకోవాలని ఆదేశించారు. టపాసుల విక్రయాలకు గుర్తించిన ప్రాంతాల్లోనే స్టాళ్లు ఏర్పాటు చేయాలని, అగ్నిప్రమాదాల నివారణకు అవసరమైన భద్రతా ప్రమాణాలు పాటించాలని తెలిపారు. టపాసుల ఆన్‌లైన్ విక్రయాలపైనా పర్యవేక్షణ ఉండాలన్నారు. ప్రజలు టపాసులు కాల్చే సమయంలో నిర్దేశించిన డెసిబెల్ పరిమితులు, సమయ పరిమితులను తప్పనిసరిగా పాటించేలా అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. దీపావళిని సురక్షితంగా, పర్యావరణహితంగా జరుపుకునేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ టెలికాన్ఫరెన్స్‌లో డీఆర్వో సి. వెంకట నారాయణమ్మ, కర్నూలు ఆర్డీవో సందీప్ కుమార్, పత్తికొండ ఆర్డీవో ఓబులేసు, ఆదోని ఆర్డీవో అరుణ దేవి, కాలుష్య నియంత్రణ మండలి ఈఈ కిషోర్ రెడ్డి, అగ్నిమాపక శాఖ అధికారి అవినాష్ జయసింహ తదితరులు పాల్గొన్నారు.

# పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో ఓపెన్ హౌస్ ఆయుధాల ప్రదర్శన

### ఆయుధాల ప్రదర్శనను ప్రారంభించిన అడిషనల్ ఎస్పీలు హుస్సేన్ పీరా, కృష్ణమోహన్

### పోలీసుల ఆయుధాలు, భద్రతా పరికరాలపై విద్యార్థులకు అవగాహన

### ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రదర్శన

కర్నూలు, అక్టోబర్ 27: (మహి న్యూస్): పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం కర్నూలు జిల్లా




పోలీసు కార్యాలయంలో ఓపెన్ హౌస్ ఆయుధాల ప్రదర్శన కార్యక్రమాన్ని అడిషనల్ ఎస్పీలు హుస్సేన్ పీరా, కృష్ణమోహన్ ప్రారంభించారు. జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అడిషనల్





ఎస్పీ హుస్సేన్ పీరా మాట్లాడుతూ పోలీసులు విధుల్లో వినియోగించే ఆయుధాలు, భద్రతా పరికరాలపై విద్యార్థి దశ నుంచే అవగాహన కలిగి ఉండాలని సూచించారు. పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు పోలీసు శాఖ పనితీరును, విధుల్లో ఉపయోగించే పరికరాలను తెలుసుకోవాలని తెలిపారు. ఏఆర్ అడిషనల్ ఎస్పీ కృష్ణమోహన్ మాట్లాడుతూ పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ నిర్వహిస్తున్న ఈ ప్రదర్శనను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. వివిధ సందర్భాల్లో పోలీసులు వినియోగించే ఆయుధాలు, వాటి పనితీరుపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్రదర్శనలో పోలీసు ఆయుధాలతో పాటు బుల్లెట్‌ప్రూఫ్ జాకెట్లు, బాంబు డిటెక్టర్లు, బాంబ్ సూట్, డాగ్ స్క్వాడ్, వజ్ర వాహనం తదితర భద్రతా పరికరాలను ప్రదర్శనకు ఉంచారు. ఈగల్ టీం ఆధ్వర్యంలో గంజాయి, ఇతర




మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచిస్తూ అవగాహన బ్యానర్లు, సమాచార పత్రాలను ప్రదర్శించారు. టోల్‌ఫ్రీ నంబర్ 1972 గురించి వివరించారు. పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ కొండారెడ్డి బురుజు వద్ద నిర్వహించిన కార్యక్రమంలో పోలీసు బ్యాండ్ బృందం దేశభక్తి గీతాలను ఆలపించింది. ఈ కార్యక్రమంలో కర్నూలు వన్‌టౌన్ సీఐ మారుతి శంకర్, ఆర్ఐలు పోతలరాజు, జావేద్, ఆర్ఎస్ఐలు, పోలీసు సిబ్బంది, నగరంలోని పలు విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు.

# ఎన్నికల నిర్వహణలో సూక్ష్మ పరిశీలకుల పాత్ర కీలకం

### పోలింగ్‌కు ముందు, సమయంలో, అనంతరం ప్రతి అంశాన్ని నిశితంగా పరిశీలించాలి

### ఎన్నికల నిబంధనల అమలుపై అప్రమత్తంగా ఉండాలి

### నిర్దేశిత నమూనాలో నివేదికలు సమర్పించాలి

### జాయింట్ కలెక్టర్ జి. సూరజ్ ధనుంజయ్




నంద్యాల, అక్టోబర్ 27: (మహి న్యూస్): మున్సిపాలిటీలు, నగర పంచాయతీల ఎన్నికల పోలింగ్ ప్రక్రియ స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా, పారదర్శకంగా జరిగేలా సూక్ష్మ పరిశీలకులు (మైక్రో అబ్జర్వర్లు) కీలక పాత్ర పోషించాలని జాయింట్ కలెక్టర్ జి. సూరజ్ ధనుంజయ్ సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో సూక్ష్మ పరిశీలకులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలపై పూర్తి అవగాహన



కలిగి ఉండాలని, పోలింగ్‌కు ముందు, పోలింగ్ సమయంలో, పోలింగ్ ముగిసిన తర్వాత చేపట్టాల్సిన విధులను బాధ్యతాయుతంగా నిర్వహించాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల పరిసరాల్లో పరిస్థితులు, ఓటర్లకు కల్పించిన సదుపాయాలు, బలహీన వర్గాల ఓటర్లపై ఒత్తిళ్లు, ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు వంటి అంశాలను తటస్థంగా పరిశీలించాలని తెలిపారు. పోలింగ్ కేంద్రాల వెలుపల ఓటర్లకు తగిన స్థలం, ఓటరు గుర్తింపు కార్డులు, ఓటర్ల జాబితాలు అందుబాటులో ఉన్నాయో లేదో గమనించాలన్నారు. పోలింగ్ కేంద్రానికి 100 మీటర్ల పరిధిలో ఎన్నికల ప్రచారం జరిగినా, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే పరిస్థితులు తలెత్తినా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. పోలింగ్ ప్రారంభానికి ముందు బ్యాలెట్ బాక్సును ఖాళీగా చూపించడం, సీలింగ్ ప్రక్రియ, పోలింగ్ ఏజెంట్ల హాజరు, ఎన్నికల సామగ్రి వినియోగం వంటి అంశాలను నిబంధనల ప్రకారం



పరిశీలించాలని స్పష్టం చేశారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన అనెక్సర్-3 మార్గదర్శకాల ప్రకారం పరిశీలన చేపట్టాలని జాయింట్ కలెక్టర్ తెలిపారు. ప్రశ్నావళిలోని ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించి, వాస్తవ పరిస్థితుల ఆధారంగా 'అవును', 'కాదు' రూపంలో సమాధానాలు నమోదు చేసి, నివేదికలను నిర్దేశిత నమూనాలో సమర్పించాలని ఆదేశించారు. సూక్ష్మ పరిశీలకులు ఎలాంటి పక్షపాతానికి తావివ్వకుండా ఎన్నికల సంఘం ఆదేశాలకు అనుగుణంగా విధులు నిర్వహించి, పోలింగ్ ప్రక్రియలో పారదర్శకతను నిర్ధారించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో రాముసాయక్, ఎల్డీఎం అయ్యపురెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు పాల్గొన్నారు.

RNI : APTEL/25/A0108
www.mahinewsindia.com
మహి న్యూస్
epaper: https://epaper.mahinewsindia.com
తెలుగు దినపత్రిక



# బిట్స్ ఇన్‌స్టిట్యూషన్‌లో ఘనంగా ఫ్రెషర్స్ డే వేడుకలు

### విద్యార్థుల కలలను నిజం చేసే వేదిక కళాశాల

### - టీడీపీ సీనియర్ నాయకుడు గాజుల ఖాదర్ బాషా




రాయచోటి, మహిన్యూస్, అక్టోబర్ 27: కళాశాలలు కేవలం చదువు నేర్పే కేంద్రాలు మాత్రమే కాదని, విద్యార్థుల ప్రతిభను వెలికితీసి, వారి కలలను నిజం చేసుకునేందుకు దోహదపడే గొప్ప వేదికలని రాష్ట్ర తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు గాజుల ఖాదర్ బాషా పేర్కొన్నారు. మంగళవారం రాయచోటిలోని బిట్స్ ఇన్‌స్టిట్యూషన్‌లో నిర్వహించిన ఫ్రెషర్స్ డే వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కొత్తగా కళాశాలలో చేరిన విద్యార్థులకు స్వాగతం పలుకుతూ, వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించి, కళాశాల వాతావరణానికి అలవాటు పడేలా చేయడమే ఫ్రెషర్స్ డే ముఖ్య ఉద్దేశమని తెలిపారు. బిట్స్ ఇన్‌స్టిట్యూషన్ వ్యవస్థాపకులు, చైర్మన్ భాస్కర్ విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపాలనే లక్ష్యంతో చేస్తున్న కృషిని అభినందించారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు, సెమినార్లలో పాల్గొని తమ ప్రతిభను పెంపొందించుకోవాలని సూచించారు. కళాశాలలో ర్యాగింగ్‌కు తావులేకుండా ప్రిన్సిపాల్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని పేర్కొన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చడంతో పాటు, విద్యాసంస్థకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు అందించే విలువైన ఆస్తి విద్యేనని అన్నారు. ఉన్నత విద్య అభివృద్ధికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ సహకారం అందిస్తున్నారని గాజుల ఖాదర్ బాషా పేర్కొన్నారు. అనంతరం బిట్స్ ఇన్‌స్టిట్యూషన్ చైర్మన్ భాస్కర్, గాజుల ఖాదర్ బాషాను శాలువా కప్పి, జ్ఞాపిక అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ కృష్ణమోహన్, స్థానిక సీఐ నాయక్, ఎస్ఐ శివరాం తదితరులు పాల్గొన్నారు.

# మైలవరం మండలంలో 12 ఎంపీటీసీ స్థానాలు ఏకగ్రీవం

### 9 స్థానాల్లో టీడీపీ, 3 స్థానాల్లో బీజేపీ అభ్యర్థుల ఎన్నిక



కడప జిల్లా/ జమ్మలమడుగు నియోజకవర్గం /మైలవరం, మహి న్యూస్ అక్టోబర్ 27: మైలవరం మండలంలోని ఎంపీటీసీ స్థానాలకు సంబంధించి మొత్తం 12 మంది సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరిలో తెలుగుదేశం పార్టీకి చెందిన 9 మంది, భారతీయ జనతా పార్టీకి చెందిన ముగ్గురు ఉన్నారు.

**ఏకగ్రీవంగా ఎన్నికైన సభ్యుల వివరాలు**

1. బెస్త వేములు: అంపసాని ఓబులేసు - తెలుగుదేశం పార్టీ
2. చిన్న కొమెర్ల: బచ్చు వెంకట ప్రసాద్ రెడ్డి - తెలుగుదేశం పార్టీ
3. దొడియం: ఉచ్చులవద్ది కాసులు - తెలుగుదేశం పార్టీ
4. దొమ్మర నంద్యాల--1: సిలివేరు లక్ష్మీదేవి - బీజేపీ
5. దొమ్మర నంద్యాల--2: నల్లగట్ల మహేశ్వరి - తెలుగుదేశం పార్టీ
6. ఎం. కంబాలదిన్నె: పోటు రమాదేవి - తెలుగుదేశం పార్టీ
7. మైలవరం: మార్తల చంద్రశేఖర్ రెడ్డి - తెలుగుదేశం పార్టీ
8. తలమంచిపట్నం: కుమ్మర సుజాత - తెలుగుదేశం పార్టీ
9. తోర్రివేములు: కసిబిసి సుజాత - తెలుగుదేశం పార్టీ
10. వద్దిరాల: అన్నెబోయిన లక్ష్మీదేవి - తెలుగుదేశం పార్టీ
11. వేపరాల--1: చిమ్మని తులసి - బీజేపీ
12. వేపరాల--2: మద్దకం రామచంద్ర - బీజేపీ

మైలవరం మండలంలో ఏకగ్రీవంగా ఎన్నికైన 12 మంది ఎంపీటీసీ సభ్యుల్లో తెలుగుదేశం పార్టీ 9 స్థానాలను, బీజేపీ 3 స్థానాలను దక్కించుకున్నాయి.

# జమ్మలమడుగులో కూటమి అభ్యర్థుల ఇంటింటి ప్రచారం

### 1, 31, 32 వార్డుల్లో ప్రజలను కలిసిన చైర్మన్ అభ్యర్థి చదిపిరాళ్ల జ్యోతి



కడప జిల్లా/జమ్మలమడుగు, మహి న్యూస్ అక్టోబర్ 27: జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలోని 1, 31, 32 వార్డుల్లో ఎన్డీఏ కూటమి అభ్యర్థులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. జమ్మలమడుగు మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి చదిపిరాళ్ల జ్యోతి, మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణరెడ్డి, భూపేష్ రెడ్డి సోదరి ప్రశాంతి ప్రచారంలో పాల్గొని స్థానిక ప్రజలను కలిశారు. ఈ సందర్భంగా వార్డుల్లో పర్యటిస్తూ ప్రజలతో మాట్లాడారు. కూటమి అభ్యర్థులకు మద్దతు తెలిపి, రాబోయే ఎన్నికల్లో విజయం సాధించేలా సహకరించాలని ఓటర్లను కోరారు. ప్రచారంలో భాగంగా స్థానిక సమస్యలు, వార్డుల అభివృద్ధికి సంబంధించిన అంశాలపై ప్రజలతో చర్చించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకుడు జంబాపురం రమణారెడ్డి, వార్డు అభ్యర్థులు గట్టు పుల్లయ్య, గుద్దేటి బాలకృష్ణ, చాపల మాధవి, ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





# విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమా?

### వార్డెన్‌పై చర్యలు తీసుకోవాలి

### ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు జాల సుమంత్ డిమాండ్




కడప, మహి న్యూస్ । అక్టోబర్ 27: కడప నగరంలోని ప్రకాష్‌నగర్ ప్రభుత్వ సంక్షేమ వసతి గృహంలో విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించడంలో నిర్లక్ష్యం వహిస్తున్న వార్డెన్ హరికృష్ణపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు జాల సుమంత్ డిమాండ్ చేశారు. మంగళవారం వసతి గృహాన్ని పరిశీలించిన ఆయన విద్యార్థుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులను కోరారు. వసతి గృహంలోని గదుల్లో విద్యుత్ బోర్డులు పాడైపోయి, తీగలు బయటకు రావడంతో విద్యార్థులు విద్యుత్ షాక్‌కు గురవుతున్నారని ఆరోపించారు. ఈ సమస్యను పలుమార్లు వార్డెన్ దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదన్నారు. వర్షం వచ్చినప్పుడు విద్యార్థులు భయంతో ఇతర ప్రాంతాల్లోని స్నేహితుల గదులకు వెళ్లి నిద్రిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం భోజనం అందించకుండా, సరిపడా ఆహారం పెట్టడం లేదని ఆరోపించారు. సమస్యలను ప్రశ్నించిన విద్యార్థులను బెదిరిస్తున్నారని పేర్కొన్నారు. జిల్లా అధికారులు వెంటనే స్పందించి వసతి గృహంలో మౌలిక సదుపాయాలు కల్పించాలని, భోజన మెనూను అమలు చేయాలని, వార్డెన్‌పై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో జిల్లావ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నగర ఉపాధ్యక్షులు కార్తీక్, చారి, నగర నాయకులు ప్రశాంత్, భాస్కర్, నవీన్, చిన్న, పుష్ప తదితరులు పాల్గొన్నారు.



# బాలల గృహాల్లో డీఎల్ఎస్ఏ కార్యదర్శి ఆకస్మిక తనిఖీలు

### బాలల వసతులు, భద్రతపై సమీక్ష.. హక్కులపై అవగాహన

కడప, మహి న్యూస్ । అక్టోబర్ 27: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అమరావతి ఆదేశాల మేరకు, కడప జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. రామ గోపాల్ సూచనలతో డీఎల్ఎస్ఏ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎస్. బాబా ఫక్రుద్దీన్ కడప నగరంలోని ప్రభుత్వ బాలుర వసతి గృహం, ప్రభుత్వ పరిశీలన గృహాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బాలలకు న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించి, వారి హక్కులు, ఉచిత న్యాయ సహాయం గురించి వివరించారు. తనిఖీల్లో భాగంగా గదులు, వంటగది, ఆహార ఏర్పాట్లు, పారిశుద్ధ్యం, మౌలిక సదుపాయాలు, రికార్డుల నిర్వహణను పరిశీలించారు. బాలలకు కల్పిస్తున్న వసతులు, సంరక్షణ, భద్రతకు సంబంధించిన అంశాలను సమీక్షించారు. రికార్డులను సక్రమంగా నిర్వహించాలని, బాలలకు అవసరమైన సదుపాయాలు కల్పించాలని సంబంధిత సూపరింటెండెంట్‌కు సూచనలు జారీ చేశారు.







**బాలల హక్కులపై అవగాహన**

అనంతరం నిర్వహించిన న్యాయ విజ్ఞాన కార్యక్రమంలో మధ్యవర్తిత్వం, మనోన్యాయ కార్యక్రమాలు, బాలల కోసం న్యాయ సేవలు, బాలల హక్కులపై అవగాహన కల్పించారు. న్యాయ సేవల ప్రాధాన్యతను వివరిస్తూ, అర్హులైన వారికి ఉచిత న్యాయ సహాయం అందుబాటులో ఉంటుందని తెలిపారు. బాలల హక్కులను పరిరక్షించడం, వారికి తగిన సంరక్షణ కల్పించడం ప్రాధాన్యమని వివరించారు. ఈ కార్యక్రమంలో మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఎం. రేష్మ, డీఎల్ఎస్ఏ సిబ్బంది, న్యాయ సహాయ రక్షణ న్యాయవాదులు, ప్యానెల్ న్యాయవాదులు, ప్రభుత్వ బాలుర వసతి గృహం, ప్రభుత్వ పరిశీలన గృహం సూపరింటెండెంట్లు, ఉపాధ్యాయులు, న్యాయ సేవా స్వచ్ఛంద కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.




# అర్నబ్ తుఫాన్‌పై అప్రమత్తం

### అంబులెన్సులు పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉండాలి

### అత్యవసర వైద్య సేవల్లో అంతరాయం ఉండకూడదు..

### డీఎంహెచ్ఓ పి. యుగంధర్



కడప జిల్లా, మహి న్యూస్ । అక్టోబర్ 27: అర్నబ్ తుఫాన్ నేపథ్యంలో ప్రజలకు అత్యవసర వైద్య సేవలు నిరంతరాయంగా అందించేందుకు అంబులెన్సులను పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉంచాలని వైఎస్ఆర్ కడప జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి పి. యుగంధర్ అధికారులను ఆదేశించారు. తుఫాన్ ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని ముందస్తు జాగ్రత్తలు, అత్యవసర వైద్య సేవల సంసిద్ధతపై మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ, రవాణా శాఖ అధికారులు, అంబులెన్స్ యూనియన్ల ప్రతినిధులతో నిర్వహించిన ఈ సమావేశంలో తుఫాన్ సమయంలో ఎదురయ్యే అత్యవసర పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు.

**అంబులెన్సుల పనితీరుపై ప్రత్యేక దృష్టి**

జిల్లాలోని 108, 104, 102 అంబులెన్సులతో పాటు ప్రైవేటు అంబులెన్సులు కూడా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్ఓ సూచించారు. వాహనాల సాంకేతిక స్థితిని పరిశీలించి, ఇంధన లభ్యతను నిర్ధారించుకోవాలని తెలిపారు. ఆక్సిజన్ సిలిండర్లు, అత్యవసర వైద్య పరికరాలు అందుబాటులో ఉండేలా ముందస్తు తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు. తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో అత్యవసర పరిస్థితులు తలెత్తితే ఆలస్యం లేకుండా అంబులెన్సులను పంపించేలా సిబ్బంది సిద్ధంగా ఉండాలని స్పష్టం చేశారు. సంబంధిత శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు వైద్య సేవలు అందించాలని, ప్రజల ప్రాణరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.

**సమన్వయంతో పనిచేయాలి**

తుఫాన్ సమయంలో ఎలాంటి పరిస్థితులు ఎదురైనా సమర్థవంతంగా స్పందించేలా వైద్య అత్యవసర సేవలను సిద్ధంగా ఉంచాలని పి. యుగంధర్ తెలిపారు. ప్రజలకు వైద్య సేవలు అందించడంలో ఎటువంటి అంతరాయం కలగకుండా అన్ని శాఖలు అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో జిల్లా ప్రోగ్రామ్ అధికారులు డాక్టర్ మహమ్మద్ తాహా, డాక్టర్ ఆరిఫుల్లా, డాక్టర్ బాలాంజనేయులు, డాక్టర్ వెంకట చంద్రారెడ్డి, డెమో భారతి, ఎపిడమాలజిస్ట్ ఖాజా, రవాణా శాఖ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, 108, 104, 102 వాహన సేవల జిల్లా నిర్వాహకులు, ప్రైవేటు అంబులెన్సుల నిర్వాహకులు పాల్గొన్నారు.

# గిరిజన బాలికల పాఠశాలలో డీఎల్ఎస్ఏ కార్యదర్శి తనిఖీలు

### విద్యార్థినుల సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులకు లేఖలు

కడప, మహి న్యూస్ । అక్టోబర్ 27: కడప నగరంలోని చిన్నచౌక్‌లో ఉన్న గిరిజన సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలను జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎస్. బాబా ఫక్రుద్దీన్ తనిఖీ చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అమరావతి ఆదేశాల మేరకు, కడప జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. రామ గోపాల్ సూచనలతో ఈ తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించి, వారి హక్కులు, న్యాయ సేవలపై అవగాహన కల్పించారు.






**వసతులు, సమస్యలపై ఆరా**

పాఠశాలలో బాలికలకు కల్పిస్తున్న వసతి, భోజనం, తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యా సదుపాయాలను కార్యదర్శి పరిశీలించారు. విద్యార్థినులతో మాట్లాడి వారికి ఎదురవుతున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో సిబ్బంది కొరతతో పాటు అవసరమైన ఫర్నిచర్ కూడా అందుబాటులో లేదని సంబంధిత అధికారులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. విద్యార్థినులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా సంబంధిత అధికారులకు లేఖలు పంపించి, అవసరమైన చర్యలు తీసుకునేలా చూస్తామని ఎస్. బాబా ఫక్రుద్దీన్ తెలిపారు. బాలికల సంక్షేమం, భద్రతకు ప్రాధాన్యతనిస్తూ అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు.

**బాలల హక్కులపై అవగాహన**

అనంతరం నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో బాలికల హక్కులు, బాలల రక్షణ చట్టాలు, ఉచిత న్యాయ సహాయం, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అందిస్తున్న సేవల గురించి వివరించారు. విద్యార్థినులు తమ హక్కులపై అవగాహన కలిగి ఉండాలని, ఏవైనా సమస్యలు ఎదురైతే అందుబాటులో ఉన్న న్యాయ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎస్. రత్న ప్రభ, డీఎల్ఎస్ఏ సిబ్బంది, వసతి గృహ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

# హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై 29న జిల్లా స్థాయి క్విజ్ పోటీలు

### విజేతలకు రూ.5 వేల వరకు నగదు బహుమతులు

### ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో రాత పరీక్ష

కడప, మహి న్యూస్ । అక్టోబర్ 27: యువతలో హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన కల్పించడంతో పాటు వ్యాధి నివారణ, ఆరోగ్య పరిరక్షణపై చైతన్యం తీసుకువచ్చేందుకు ఈ నెల 29న కడపలో జిల్లా స్థాయి క్విజ్ పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, క్షయ వ్యాధుల అధికారి డాక్టర్ ఎస్. రవి బాబు, ప్రాంతీయ ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి, ఇన్‌చార్జి జిల్లా వృత్తి విద్యాధికారి డాక్టర్ సి. సురేష్ బాబు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు జిల్లా ఎయిడ్స్ నియంత్రణ, నివారణ సంస్థ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, ఇంటర్మీడియట్ విద్యాశాఖ సంయుక్తంగా ఈ పోటీలను నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. కడపలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు రాత పరీక్ష రూపంలో పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు.

**8, 9 తరగతులు, ఇంటర్ విద్యార్థులకు అవకాశం**

ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లో చదువుతున్న 8, 9 తరగతులతో పాటు ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనేందుకు అర్హులని అధికారులు తెలిపారు. పోటీలకు హాజరయ్యే విద్యార్థులు తాము చదువుతున్న పాఠశాల లేదా కళాశాల నుంచి ధ్రువీకరణ పత్రం తప్పనిసరిగా తీసుకురావాలని సూచించారు. ప్రతి బృందంలో ఇద్దరు విద్యార్థులు మాత్రమే పాల్గొనాలని స్పష్టం చేశారు.

**విజేతలకు నగదు బహుమతులు**

జిల్లా స్థాయి పోటీల్లో విజయం సాధించిన వారికి నగదు బహుమతులు అందజేయనున్నారు.

ప్రథమ బహుమతి: రూ.5,000
ద్వితీయ బహుమతి: రూ.4,000
తృతీయ బహుమతి: రూ.3,000
ప్రోత్సాహక బహుమతి: రూ.2,000

జిల్లా స్థాయిలో విజయం సాధించిన విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం పొందుతారని అధికారులు తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. వివరాలకు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు 8919025562, 9542023499, 9959514601 వివరాలు: జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, వైఎస్సార్ కడప జిల్లా.

# ఎర్రగుంట్లలో ఏకగ్రీవ ఎంపీటీసీలకు డిక్లరేషన్ ఫారాలు అందజేత

### విజేతలకు కూటమి నాయకుల అభినందనలు



కడప జిల్లా/ఎర్రగుంట్ల, మహి న్యూస్ అక్టోబర్ 27: ఎర్రగుంట్ల మండలంలో ఏకగ్రీవంగా ఎంపికైన ఎంపీటీసీ సభ్యులకు మంగళవారం సాయంత్రం ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో అధికారులు డిక్లరేషన్ ఫారాలను అందజేశారు. ఈ సందర్భంగా కూటమి మండల ఇన్‌చార్జి మధుసూదన్ రెడ్డి పాల్గొని, ఏకగ్రీవంగా ఎంపికైన సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలకు సేవ చేస్తూ మండల అభివృద్ధికి కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎర్రగుంట్ల మున్సిపల్ మాజీ చైర్మన్ ఎం. హర్షవర్ధన్ రెడ్డి, ఎంపీడీవో వెంకట రమణయ్య, తదితరులు పాల్గొన్నారు.

# జమ్మలమడుగులో ఎన్డీఏ కూటమి ఎన్నికల సభ



కడప జిల్లా/జమ్మలమడుగు, మహి న్యూస్ అక్టోబర్ 27: జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలోని 6, 7, 8 వార్డుల్లో ఎన్డీఏ కూటమి అభ్యర్థుల తరఫున ఎన్నికల సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జమ్మలమడుగు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చదిపిరాళ్ల ఆదినారాయణరెడ్డి, కడప జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు, జమ్మలమడుగు నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి చదిపిరాళ్ల భూపేష్ సుబ్బరామిరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ 6వ వార్డు నుంచి తెలుగుదేశం పార్టీ అభ్యర్థి శశికిరణ్, 7వ వార్డు నుంచి భారతీయ జనతా పార్టీ అభ్యర్థి వెంకటేష్, 8వ వార్డు నుంచి తెలుగుదేశం పార్టీ అభ్యర్థి మాబువల్లిని గెలిపించాలని ఓటర్లను కోరారు. అలాగే మున్సిపల్ చైర్‌పర్సన్ అభ్యర్థి చదిపిరాళ్ల జ్యోతికి అత్యధిక ఓట్లు వేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి అభ్యర్థులకు ప్రజలు మద్దతు తెలిపి విజయం చేకూర్చాలని నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు, ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



EDITOR and PUBLISHER and OWNED BY NEELI RAMASUBBAIAH, PUBLISHED AT #1/704, PARK STREET, NEAR OLD BUSTAND, JAMMALAMADUGU-516434,YSR KADAPADIST, A.PPRINTED AT VSAR PRINTERS, YSR KADAPA DIST, 516004. RNI NO : APTEL/25/A0108. Cell 90 59 58 58 98. Email : mahinewsindia@gmail.com, website : https//epaper.mahinewsindia.com